J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 44 సంచిక : 2 14.06.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## నవ్యాంధ్రలో 'చంద్రోదయం'





# విజేతలకి విజయాభినందనలు







**శ్రీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి**
పార్లమెంటు సభ్యులు, నెల్లూరు

**శ్రీ మాగుంట శ్రీనివాసులరెడ్డి**
పార్లమెంటు సభ్యులు, ఒంగోలు



**శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి**
శాసనసభ్యులు, సర్వేపల్లి



**శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి**
శాసనసభ్యురాలు, కోవూరు



**శ్రీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**
శాసనసభ్యులు, నెల్లూరు రూరల్

రాష్ట్ర అభివృద్ధికి సారథులు.. జిల్లా ప్రగతికి వారధులు
మా హితులు, సన్నిహితులందరికీ
**విజయాభినందనలు.**



**సిద్ధారెడ్డి వెంకట రంగారెడ్డి**
**సిద్ధారెడ్డి కవిత**

R CUBE PROPERTIES
R CUBE CONSTRUCTION COMPANY

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 16

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 44 సంచిక : 2 14.06.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# నవ్యాంధ్రలో నవోదయం!

## కొత్త సర్కారు కొలువు... సుపరిపాలనకి నెలవు!





ఆంధ్రప్రదేశ్‌లో కొత్త సర్కారు కొలువయ్యింది. అనుభవానికి, అహంభావానికి జరిగిన పోరాటంలో అనుభవం ఆధిపత్యం సాధించి అందలం ఎక్కింది. అహంకారుల పాలనలో అంధకారంలోకి వెళ్లిపోయిన నవ్యాంధ్రకి నవోదయం వచ్చింది. చీకట్లు చిమ్ముకుంటూ వచ్చిన చంద్ర కాంతి రాష్ట్రానికి కొత్త వెలుగులు తెచ్చింది. జూన్ 12వ తేదీ అంబరాన్నంటే సంబరంలా జరిగిన కూటమి ప్రభుత్వ ప్రమాణస్వీకార మహోత్సవాన్ని తిలకించిన తెలుగువాడి హృదయం భావోద్వేగంతో ఉప్పొంగింది.

10లో





# మన మంత్రులు వీళ్లే..


**ఆనం రామనారాయణరెడ్డి...**
సుధీర్ఘ రాజకీయ ప్రస్థానం. అయిదుసార్లు మంత్రిగా అలుపెరుగని ప్రస్థానం.

**పొంగూరు నారాయణ...**
విద్యావేత్తగా దేశమంతా సుపరిచితం, ఒకసారి మంత్రిగా అనుభవం.
వీళ్ళిద్దరిదీ నెల్లూరుజిల్లా.



**సత్యకుమార్ యాదవ్...**
వెంకయ్య నాయుడుతో పాతికేళ్ళ బంధం, దత్తపుత్రుడిగా నెల్లూరీయులతో ఎనలేని అనుబంధం.


ఈ ముగ్గురి కథనాలు 7, 9, 15లలో

# 'వాత్సల్య' విద్యార్థులకు బహుమతులు



నెల్లూరులోని జనహిత–వాత్సల్య ఆశ్రమంలోని అనాథ బాలబాలికలు 18 మంది టెన్త్‌లో మంచిమార్కులు సాధించడంతో స్థానిక మానవసేవే మాధవసేవ సంస్థ ఆధ్వర్యంలో ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ వారు వెయ్యి రూపాయల వంతున విద్యార్థులకు ఇటీవల ప్రోత్సాహక బహుమతులిచ్చి వారిని అభినందించారు. ఆ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు మాట్లాడుతూ, ఇందులో 10 మంది విద్యార్థులకు సబ్ రిజిస్ట్రేషన్ అధికారి బాలకృష్ణారెడ్డి, ఇద్దరికి సబ్ ట్రెజరీ అధికారి రమణరావు, మరో ఇద్దరికి నర్సు సక్కుబాయమ్మ, ముగ్గురికి హెల్త్ సూపర్‌వైజర్ వసంత, ఒక విద్యార్థికి ఏటి కమల్ ఆ బహుమతులను అందజేశారని తెలిపారు. గూడూరు సబ్‌ట్రెజరీ అధికారి ఎస్‌కె మసూద్ ఈ సందర్భంగా ఆశ్రమానికి రూ. 5 వేల రూపాయల విలువచేసే నిత్యావసర సరుకులను, ఫార్మసీ అధికారిణి భానురేఖ రూ. 2వేలతో విద్యార్థులకు తినుబండారాలను అందజేశారంటూ.. వారిని అభినందించారు. జనహిత– వాత్సల్య సంస్థ ఆర్గనైజింగ్ కార్యదర్శి జీవీ సాంబశివరావు, సేవాబృందం నిర్వాహకురాలు పరిమళ, ఖాదర్‌మస్తాన్, వెంకటసాయి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



# 'జన'పవనం

అతడొక మధ్యందిన మార్తాండుడు
ప్రభంజనమై శర పరంపరల్ని ఎక్కుపెట్టిన
విలుకాడు... విహాయస నేత్రుడు
జనం కోసం... జగతి కోసం దివి నుండి
దిగివచ్చిన శేషేంద్రుడు, శేముషీ దురంధరుడు
జాతికి స్వేచ్ఛా సమీర స్వప్నాల్ని నినదించిన
'జగత్'సేనాని! దృఢదీక్షా గని
అతనిలోని గాయాలు ఆవేదనలుగా, ఆగ్రహావేశాలుగా రగిలి
మాటలు తూటాలుగా పేలాయి
అవని అంతా మిన్నాగులు బుసలుకొట్టే వేళ
తానో నాగస్వరమై నిలిచాడు
చంద్రనిప్పులు కక్కే ఆవేశానికి
కాసింత విజ్ఞతను జోడించి
నిర్మాణాత్మక ఆలోచనా స్రవంతిని ప్రభావశీలతతో క్రీడించి
సై అంటే సై అని తొడ చరచిన ఒడుపు తెలిసిన
మల్లయోధుడు
సంద్రంలో అలపైకెగసినపుడు ఎలా తలవంచాలో
జన జాగృతం కోసం ఎలా పదునెక్కాలో
లాఘవం తెల్సిన నేర్పరి.
పెనుసవాళ్ళను పుక్కిటపట్టి
దార్శనికుడై నడిపించిన సామర్థ్యపు 'పవనిజం' ఆయనది
'క్విట్ ఇండియా'లా ఓటు చీలనివ్వనన్న
తారక మంత్ర ప్రతిఘటన పతాకనెత్తుకొన్న ధీరోధాత్తుడు
ప్రజాహృదయ సీమల్లో క్లైమోర్‌లు రేపి
భుజం తట్టి నడిపించిందీ అతగాడే
అరాచకం పట్ల, అమానుషత్వం పట్ల
అల్లూరి సీతారామరాజై ఉగ్రరూపం దాల్చాడు
ఆంధ్రలోని ప్రతి ప్రదేశాన్ని చికాగో
చేసుకొన్న అభినవ వివేకానందుడాయన.
మహోద్యమ మహాసంకల్పంతో
నడిచే తుఫాను అతడే
జన పవన నినాదం విన్పిస్తున్న
వీర'జన'సైనికుడు!
వైప్లవ్య నాయకుడై రణన్ని
నాదం విన్పిస్తున్న
మేరునగమాతడే!!



చిన్ని నారాయణరావు
9440202942



## కనుపూరు ముత్యాలమ్మకు
# విశేష పూజలు

చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామదేవత శ్రీ ముత్యాలమ్మవారి దేవాలయంలో ఈనెల 9న అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు వేకువనే సుప్రభాత సేవ అనంతరం మూలమూర్తికి అభిషేకాలు చేసి, శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కార్యనిర్వహణాధికారి నవీన్ కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

## 23 నుంచి నర్రవాడలో..
# శ్రీ వెంగమాంబ బ్రహ్మోత్సవాలు



దుత్తలూరు మండలం నర్రవాడలో కొలువై ఉన్న శ్రీ వెంగమాంబాదేవి పేరంటాలు అమ్మవారి బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అంగరంగవైభవంగా జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా, 23వ తేది ఆదివారం నిలుపు, పసుపు దంచే కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 24–25 తేదీల్లో రథోత్సవం నేత్ర పర్వంగా జరుగుతుంది. 26న పసుపు కుంకుమ ఉత్సవం, 27న పొంగళ్ల సమర్పణ జరుగుతాయి. ఈ బ్రహ్మోత్సవాలకు దేశం నలుమూలల నుంచి ఏటా లక్షలాది మంది భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్థానిక ప్రజల సహకారంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## వైకాపా ఓటమితో
# పలువురి రాజీనామాలు

సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా పరాజయం పాలుకావడంతో, ఆ పార్టీ నియామకాలతో అప్పటిదాకా పలు సంస్థలకు ఛైర్మెన్‌లుగా ఉన్నవారు ఒక్కొక్కరుగా రాజీనామాలు చేస్తున్నారు. నెల్లూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ (ఏఎంసీ) పదవికి ఈనెల 8న పేర్నేటి కోటేశ్వరరెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మెన్‌గా ఉన్న వీరి చలపతిరావు, ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్మెన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డిలు తమ ఛైర్మెన్ పదవులకి రాజీనామా చేశారు.



## ఉదయగిరి కోటపై..
# ఎగిరిన 'దేశం' జెండా

ఉదయగిరి కోటపై తెలుగుదేశం జెండా ఎగరేస్తామన్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల కోరిక ఎట్టకేలకు తీరింది. ఉదయగిరి టీడీపీ అభ్యర్థిగా కాకర్ల సురేష్ గెలుపుతో ఆ పార్టీ కార్యకర్తలు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఇటీవల పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో కాకర్ల సురేష్ గెలిస్తే, ఉదయగిరి కోటపై జెండా ఎగరేయాలన్నది టీడీపీ కార్యకర్తల సంకల్పం. కాకర్ల భారీ మెజార్టీతో విజయం సాధించడంతో, కలిగిరి మండలంలోని కొత్తూరు గ్రామస్తులు ఉదయగిరికి తరలివెళ్లారు. వెలగపాడు మాజీ సర్పంచ్ కేతినేని సాంబశివరావు, నాయకులు కేతినేని శ్రీకాంత్, బెజవాడ రమేష్, కూరపాటి వెంకట్రావు, మహేంద్ర, మధు, మాధవ, వెంకట్, శ్రీను తదితరులంతా ఉదయగిరి కోటపైకి వెళ్లి తెలుగుదేశం పార్టీ జెండాను ఎగరేశారు. తెలుగుదేశం అధినేత చంద్రబాబు సారథ్యంలో, కాకర్ల ఆధ్వర్యంలో ఉదయగిరి సమస్యలు తీరి, అభివృద్ధి పథంలో నడుస్తుందని వారంతా ఆకాంక్షించారు.

# సముద్రజీవులను పరిరక్షించాలి

## పోర్టు సీఓఓ రాజన్‌బాబు



సముద్రజీవుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ముత్తుకూరు మండలంలోని అదాని కృష్ణపట్నం పోర్టు సీఓఓ రాజన్‌బాబు పిలుపునిచ్చారు. ఇటీవల ప్రపంచ మహాసముద్రాల దినోత్సవం సందర్భంగా పోర్టు మెరైన్ విభాగం వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, జీవరాశుల మనుగడకు సముద్రాలను కలుషితం కాకుండా కాపాడుకోవాలన్నారు. తొలుత సాగర తీరంలో ఉన్న వ్యర్థపదార్థాల ఏరివేత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో ఆయనతో పాటు కెప్టెన్ రజిత్‌కార్క్, కెప్టెన్ సాహు, గణేశ్‌శర్మ, వెంకటేష్ భాస్కరన్, ముత్యం జయరామ్, జునీద్ తదితరులున్నారు.

# పవన్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి



జనసేనాని పవన్‌కళ్యాణ్ ప్రజల అభ్యున్నతి కోసం తీసుకుంటున్న నిర్ణయాలను, ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరు రూరల్ పరిధిలో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజయం కోసం పనిచేసిన ఉప్పుటూరు గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకులను కలసి అభినందించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి సునామీ సృష్టించడంలో పవన్‌కల్యాణ్ కీలకపాత్ర పోషించారని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు వికాస్, శ్రీనివాసులు, చైతన్య, జయకృష్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పడారుపల్లి గంగమ్మతల్లికి.. మహాకుంభాభిషేకం



నెల్లూరు సమీపంలోని పడారుపల్లి దేవస్థానంలో కొలువైవున్న గ్రామదేవత గంగమ్మ తల్లికి ప్రథమ వార్షికోత్సవ మహాకుంభాభిషేకాల్లో భాగంగా ఈనెల 9న శ్రీ సీతారామ, శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. కుర్తాళం శ్రీ సిద్ధేశ్వర పీఠం ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌వర్మ, వేదపండితులు, ఆలయ అర్చకులు అమ్మవారికి శోభాయమానంగా అలంకారాలు నిర్వహించి, కుంకుమార్చన, సుహాసినిపూజ తదితర విశేషపూజలు చేశారు. పల్లకిసేవతో పాటు పెద్దఎత్తున హోమాలు, మహాకుంభాభిషేకం వైభవంగా నిర్వహించారు. అత్యంత వైభవంగా జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తరించారు. అమ్మవారి భక్తుడు కాకుటూరు శ్రీహరియాదవ్ పర్యవేక్షణలో, ఈ పూజలు జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## వైసీపీ ఎందుకింత ఘోర పరాజయం పొందింది..?

# బాబు గెలిచాడా?.. జగనే ఓడిపోయాడా??



**ఈవీయంలు భారతంలో శకుని పాచికలలా పనిచేశాయని అంటున్న జగన్.**

**ముఖ్యమంత్రిగా చంద్రబాబు తొలి సంతకం చేయకముందే రాష్ట్రంలో కూటమి హనీమూన్ నడుస్తుందని జగన్ కామెంట్.**

*ఈ సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా ఘోరాతిఘోరంగా ఓడిపోయింది. గత ఎన్నికలలో 151 సీట్లు సాధించిన ఆ పార్టీ ఈ ఎన్నికలలో కేవలం 11 సీట్లకి పరిమితమైపోయింది. 164 సీట్లతో కూటమి గెలిస్తే అందులో అచ్చంగా టీడీపీకే 135 సీట్లొచ్చాయి. ఇప్పుడు బాబు గెలుపు సంగతటుంచితే, ఆయన గెలవడం కన్నా జగన్ ఓడిపోవడంపైనే రాజకీయవర్గాలలో ఎక్కువ చర్చ జరుగుతోంది. 'బాబు గెలవలేదు... జగనే ఓడిపోయాడు' అని విశ్లేషకులు చెప్పడం ఒకింత ఆశ్చర్యాన్ని, దిగ్భ్రాంతిని కలిగిస్తోంది.*

వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డితో సహా ఆ పార్టీ నాయకులు, క్షేత్ర స్థాయిలో పనిచేసిన పార్టీ శ్రేణులు తమ ఓటమిపై సమీక్షలు చేసుకుంటున్నారు. తాజాగా 13వ తేదీ గురువారం తన క్యాంపు కార్యాలయంలో జరిగిన పార్టీ శాసనమండలి సభ్యుల సమావేశంలో జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఈవీఎంల పని తీరుపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలని అన్నారు. మొన్న జరిగిన ఎన్నికలలో ఈవీఎంలు భారతంలో శకుని పాచికలలా పని చేశాయని అంటూ కొత్త అంశాన్ని తెరపైకి తెచ్చారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అధికారికంగా బాధ్యతలు చేపట్టక ముందే ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి హనీమూన్ జరుగుతోందని ఎద్దేవా చేశారు.

### మేధావులు ఏమంటున్నారు!

జగన్‌మోహన్‌రెడ్డికి జరిగిన ఘోర పరాభవానికి స్వయంకృతాపరాధమే కారణమని రాజకీయ విశ్లేషకులు, మేధావులు అంటున్నారు. వైసీపీ పాలనలో కొనసాగిన కొన్ని దురాగతాలను పరిశీలిస్తే...

గడచిన అయిదేళ్ళలో ఎక్కడ చూసినా దాడులు దుర్మార్గాలు కొనసాగాయి. ప్రత్యర్థులపై సాగించిన కక్షసాధింపులకి, అకృత్యాలకి, బనాయించిన అక్రమకేసులకి లెక్కే లేదు. అధికార అహంకారంతో ఆ పార్టీ నేతలు చేసిన అక్రమ వ్యాపారాలు, దురాక్రమణలు, బలవంతపు వసూళ్లు అన్ని ఇన్నీ కావు. ఇవన్నీ చాలవన్నట్లు పార్టీ నాయకులే మట్టి, ఇసుక, సిలికా అక్రమ రవాణా నిరాటంకంగా కొనసాగించారు. వీటితోపాటు కొండలు, గుట్టలు కొల్లగొట్టి నేలమట్టం చేసి కోట్ల రూపాయలు పోగేసుకున్నారు. అన్ని వ్యవస్థలని భ్రష్టు పట్టించి నిర్వీర్యం చేసేశారు.

ఇలా ఒకటారెండా లెక్కలేనన్ని అకృత్యాలను చూసి విసిగిపోయిన జనం, వైకాపా పట్ల విరక్తి పెంచుకున్నారని కూడా విశ్లేషకులు చెప్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మొండితనం, వైకాపా నాయకుల అరాచకత్వం కలసి తమ పార్టీని తామే నాశనం చేసుకున్నారని, అదంతా వారి స్వయంకృతాపరాధమేనని ఆ పార్టీ శ్రేణులే చెప్తున్నారు. దీంతో పాటు వైకాపా సలహాదారుల తీరువల్లే పార్టీ భ్రష్టు పట్టిందని, లక్షలాది రూపాయల జీతాలు తీసుకుంటున్నా ఎవరి స్వార్థం వారిదన్నట్లు ఇష్టానుసారంగా వారు వ్యవహరించడం వల్లే పార్టీకి కోలుకోలేనంత దెబ్బ తగిలిందని కూడా వారు వాపోతున్నారు.

బాధ్యతాయుతంగా ప్రభుత్వానికి సేవలందించే ఉద్యోగులు, ఉపాధ్యాయులను అవమానించడం, ఉద్యోగులకు సమయానికి జీతాలివ్వకపోగా.. వారికి ఇవ్వవలసిన అదనపు భత్యాలను కూడా నిలిపేసి వారిని ఇబ్బందులకు గురిచేయడం మరో ముఖ్య అంశంగా పేర్కొంటున్నారు.

అమరావతి కోసం ఆరాటపడిన రైతులను, మహిళలను సైతం భయాందోళనలకు గురిచేశారు. దాడులకు తెగబడ్డారు. తద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వంపై వ్యతిరేకత వచ్చేలా చేసుకుని పార్టీ ప్రతిష్టని వారికి వారే దిగజార్చుకున్నారని విశ్లేషిస్తున్నారు.

వీటన్నిటితో పాటు మరికొన్నిటిని గమనిస్తే...

మద్యం వ్యాపారం ప్రభుత్వ అధీనంలో, పార్టీ పెద్దల కనుసైగల నడుమ జరిగింది. ఆ కారణంగా ఈ ఐదేళ్లలో మద్యపానప్రియులు వారికి కావలసిన బ్రాండ్లు తాగలేకపోయారు. అనాకారి బ్రాండ్లను, ఆకాశాన్ని అంటే ధరలతో అమ్మి మందుబాబుల ఆరోగ్యం నాశనం చేశారు. రివర్స్ టెండరింగ్ అంటూ కొత్త పదాన్ని తెరపైకి తెచ్చి నీటిపారుదల ప్రాజెక్టుల పురోగతిని అడ్డుకున్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన కాంట్రాక్టర్ల బిల్లులు నిలిపేశారు. దేశంలోకల్లా అత్యధిక స్థాయికి మన రాష్ట్రంలో పెట్రోల్, డీజల్ ధరలు పెరిగిపోతే వాటిని నియంత్రించడంలో విఫలమయ్యారు. ట్రూఅప్ చార్జీల పేరుతో ఇష్టారాజ్యంగా కరెంటు బిల్లులు పెంచేసి మధ్యతరగతి కుటుంబాల శాపాలని సొంతం చేసుకున్నారు. మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చి పదేళ్లుగా రాష్ట్రానికి రాజధానే లేకుండా చేశారు. ఇసుక ధరని అమాంతం పెంచేసి భవన కార్మికుల పొట్టకొట్టారు.

### అనుకున్నదొకటైతే... జరిగింది మరొకటి....

రాజన్న బిడ్డ జగన్ అధికారంలోకి వస్తే... అనాథాంధ్ర అభివృద్ధి బాటలో పడుతుందని ఆశపడ్డారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా వస్తుందని కలలు కన్నారు. పోలవరం జలకళతో పొంగిపోతుందని పొంగిపోయారు. రాష్ట్రానికో రాజధాని ఏర్పడుతుందని సంబరపడ్డారు. పరిశ్రమలు కోకొల్లలుగా వస్తాయని ఊహించుకున్నారు. నీటిపారుదల ప్రాజెక్టులకు లోటుండదని భావించారు. విద్యారంగం విప్లవాత్మకమార్పులతో సాగుతుందని ఉబలాటపడ్డారు.

ఒక్కమాటలో చెప్పాలంటే జగన్ రాకతో రాష్ట్రం సస్యశ్యామలమవుతుందని, అన్నపూర్ణ ఆంధ్రకు తిరిగి పూర్వవైభవం వస్తుందని ప్రజలు భావించారు. కానీ, తాము అనుకున్నదొకటైతే మరొకటి జరిగిందని.. ఆశలన్నీ ఆడియాసలయ్యాయని గ్రామస్థాయిలో పనిచేసిన వైసీపీ పార్టీ శ్రేణులే నిరాశగా చెప్తున్నారు.

### రాజకీయంగా కూడా వైఫల్యం!

వైసీపీకి అధికారం కట్టబెట్టక ముందు రాష్ట్రాన్ని పాలించిన ప్రభుత్వ పనితీరు బాగాలేదనే ప్రజలు కొత్త పార్టీని ఎన్నికున్నారు. అయితే, జగన్ ప్రభుత్వం వచ్చిన మరుక్షణం నుండి చంద్రబాబు జపం చేస్తూనే ఉంది. జగన్‌మోహన్‌రెడ్డితో సహా ఆ పార్టీ శ్రేణులంతా నిత్యం బాబు నామస్మరణ చేస్తూనే ఉన్నారు. తాము ఏమి చేయబోతున్నామో, ఏమి చేశామో చెప్పకుండా బాబు వైఫల్యాలని ఎత్తి చూపడానికి కాలమంతా గడిపేశారు. ప్రజలు మర్చిపోవాలన్నా మర్చిపోనీయకుండా బాబుని తరచూ జనాలకి గుర్తుచేస్తూనే వచ్చారు. తమకు వచ్చిన అన్ని బూతులతో బాబుని తిట్టసాగారు. అసెంబ్లీలో ఆయనని ఘోరంగా అవమానించారు. దేవుడి స్క్రిప్ట్ అంటూ ఆయనని అవహేళన చేశారు. ఆయన కుటుంబసభ్యులను లక్ష్యంగా చేసుకుని మాట్లాడి ఆయన చేత కంటతడి పెట్టించారు. అసెంబ్లీలో తనకి జరిగిన పరాభవాన్ని బాబు ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఇది గౌరవ సభ కాదు, కౌరవ సభ అంటూ అసెంబ్లీని ఉద్దేశించి కామెంట్ చేశారు. ప్రజాక్షేత్రంలో పోరాడి ఈ సభని గౌరవ సభగా మార్చి ముఖ్యమంత్రిగా మళ్ళీ సభలో అడుగుపెడతానని శపథం చేసి సభ నుండి బయటకి వచ్చారు. తన శపథాన్ని నెరవేర్చుకుని మళ్ళీ అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు.

ప్రజలు పడుకోబెట్టిన పార్టీకి మళ్ళీ వైసీపీ శ్రేణులే జీవం పోశారు. దింపుడు కల్లం ఆశతో ఉన్న పార్టీని వైసీపీ నాయకులే ఐసీయూకి చేర్చారు. అక్కడ కొన ప్రాణాలతో వున్న సమయంలో చంద్రబాబుని అరెస్టు చేసి పూర్తిస్థాయిలో టీడీపీకి ఊపిరి పోశారు. జీవన్‌టోన్ టానిక్ తాగిన వాడిలా చంద్రబాబు సమరోత్సాహంతో జైలు నుండి బయటకి వచ్చారు. ప్రాణాలొడ్డి పోరాడి ప్రజలు వైసీపీని మట్టి కరిపించేలా చేశారు.

### పవన్ కళ్యాణ్‌ని కవ్వించి.. కసిని పెంచారు

జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ విషయంలో కూడా వైసీపీ తప్పు చేసింది. ఆయన సమర్థతని గురించి ప్రశ్నించకుండా, ఆయన వ్యక్తిగత జీవితాన్ని టార్గెట్ చేసింది. అప్పటికే బీజేపీతో పొత్తులో వున్న పవన్‌ని బాబుతో కలిసేలా వైసీపీయే ఉసికొల్పింది. బాబుతో కలిసిన పవన్ బీజేపీతో బాబుని జత కట్టించేలా జగన్ పార్టీయే ఆయనని కవ్వించింది. ఫలితంగా జగన్ వ్యతిరేక శక్తులన్నీ ఒక్కటయ్యేలా చేసి వైసీపీ ఘోరంగా నష్టపోయింది.

ఇలా చెప్పుకుంటూపోతే కర్ణుడి చావుకి కారణాలు అనేకం అన్నట్లుగా జగన్‌మోహన్‌రెడ్డి ఓటమికి కారణాలు చాలానే ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు. జరిగిన పరిణామాలన్నీ గమనిస్తే... ఇది జగన్ ఓటమే తప్ప, బాబు గెలుపు కాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు!



లాయర్
జూన్ 14, 2024

# నెహ్రూ తర్వాత.. మూడోసారి ప్రధానిగా మోడీ!

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత.. భారత రాజకీయాల్లో అత్యంత అరుదైన ఘట్టమిది. భారత దేశ ప్రధానిగా నరేంద్ర దామోదర్ దాస్ మోడీ వరుసగా మూడోసారి ('హ్యాట్రిక్') ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం ఒక అద్భుతం!..దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత, అంతటి ఘనత సాధించిన మహానేత మోడీయే కావడం దేశ చరిత్రలోనే అపూర్వమైన విషయం. ఇదో చరిత్రాత్మక విజయం. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలకు ప్రాధాన్యతనిస్తూ మొత్తం 71 మంది మెరికల్లాంటి మంత్రులతో ప్రధాని మోడీని, మోడీ సారధ్యంలోని మంత్రి వర్గాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల ప్రమాణస్వీకారం చేయించడం, ఆ అపురూప దృశ్యాలన్నీ దేశప్రజలను సంతోషంలో తలమునకలు వేయించడం తెలిసిందే.

2014లో తొలిసారిగా మోడీ ప్రధాని పీఠం అధిష్టించారు. ఆ ఎన్నికల్లో బీజేపీ కనీవిని ఎరుగని విధంగా 543 స్థానాలకు గాను 272 స్థానాల్లో విజయం సాధించి, అప్పటిదాకా సుదీర్ఘ కాలంగా ఈ దేశాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్‌ను ఓడించి బీజేపీ జయపతాకను ఎగరవేసింది. ఆ తర్వాత 2019లోనూ మోడీ ప్రభంజనమే కొనసాగింది. ఈసారి తొలిసారి కంటే అత్యధిక స్థానాల్లో నిలిచి గెలిచి బీజేపీ తన సత్తా ఏమిటో నిరూపించుకుంది. 303 స్థానాల్లో అత్యద్భుత విజయాలు సాధించి మరోసారి పూర్తి మెజారిటీతో కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఒక్క మోడీకే చెల్లింది. అదేవిధంగా తాజాగా ఇప్పుడు మూడోసారి కూడా మోడీయో ప్రధానిగా ఎన్నికై 'హ్యాట్రిక్ ప్రధాని'గా అరుదైన రికార్డును సొంతం చేసుకోవడం విశేషం. రైతుల సంక్షేమానికి సంబంధించిన ఫైలుపై ఆయన తొలి సంతకం చేసి, కిసాన్ సమ్మాన్ యోజన కింద 9.3 కోట్ల మంది రైతుల ఖాతాలకు రూ.20వేల కోట్లు జమ చేశారు. అభివృద్ధి-సంక్షేమం రెండు కళ్ళుగా పాలన సాగిస్తూన్న మోడీ ప్రభుత్వానికి ఢోకా లేదన్నది అందరి మాట. ఇండియా కూటమి కొంత పుంజుకుంటున్నా, మోడీ సారధ్యంలోని ఎన్డీఏ కూటమి ఆధిక్యతలో ఉండడంతో, మోడీ మళ్ళీ మూడోసారి ప్రధాని అయ్యారు. మోడీ ఏకంగా మూడుసార్లు ప్రధాని పీఠం అధిష్టించడానికి ముఖ్యకారణం..అభివృద్ధి మంత్రమే. దేశాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రధాని మోడీ చేసిన, చేస్తున్న కృషికి దేశప్రజలు బాసటగా నిలిచారు. బీజేపీ గెలుపుకు, ప్రధానిగా మోడీ విజయానికి అదే తారక మంత్రంగా నిలిచింది. జన్‌ధన్ యోజన, స్వచ్ఛభారత్, భేటీ బచావో.. భేటీ పడావో', ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన వంటి విశిష్టమైన పథకాల రూపకల్పనతో మోడీ ప్రభుత్వం ప్రజల హృదయాలకు చేరువైంది. ఏ పథకం ప్రవేశపెట్టినా నిష్పాక్షికంగా, పారదర్శకంగా అమలుచేయడంలో కేంద్రప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ ప్రజలను బాగా ఆకట్టుకుంటోంది. ప్రపంచాన్నే భయపెడుతున్న ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సాహసోపేతమైన చర్యలకు ఉపక్రమించడంలో మోడీ కీలకపాత్ర పోషించడం, కరోనా వంటి కష్టకాలంలో ప్రపంచానికి ఆప్తమిత్రునిగా భారత్ తరపున మోడీ ఆదర హస్తాలందించడం వంటి ఎన్నో సంఘటనలు ప్రధాని మోడీ పాలనను ప్రజలు మరింతగా అక్కున చేర్చుకోవడానికి ప్రధాన కారణాలంటూ రాజకీయవర్గాలు విశ్లేషిస్తున్నాయి. అచంచల దైవభక్తి, అకుంఠిత దేశభక్తి, అపారమైన ప్రజాసేవానురక్తి కలిగిన మోడీ చేతుల్లోనే దేశం భద్రంగా ఉంటుందనే మాటలు సామాన్యజనంలో కూడా వినిపిస్తున్నాయి. ఆ ప్రజాశీస్సులే ఆయన్ను అందలమెక్కించాయి. అయోధ్యలో రామ మందిరం, సెక్షన్ 370 రద్దు వంటి ఎన్నో సంస్కరణలు, ప్రజాసంక్షేమం కోసం అమలుచేస్తున్న పథకాలు, దేశ రక్షణకు తీసుకుంటున్న కట్టుదిట్టమైన చర్యలు అన్నివర్గాల ప్రజల్లో సంతోషం కలిగిస్తున్నాయి. అందుకే, విపక్షాలు ఎన్నెన్ని విమర్శలు చేస్తున్నా, మోడీ సారధ్యంలో దేశంలో ప్రగతి సాధనతోపాటు, సంక్షేమ పథకాలతో పారదర్శక పాలన జమిలిగా కొనసాగుతుండడంతో ప్రజలు మోడీని బాగా ఆదరిస్తున్నారనే అభిప్రాయాలున్నాయి. అయితే, అదే సందర్భంలో.. దేశంలో నానాటికీ పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగం వంటి దురవస్తలను రూపుమాపేందుకు, పెరిగిపోతున్న అసమానతలను నివారించేందుకు, దేశానికి వెన్నెముక లాంటి రైతాంగం కష్టాలు తీరేందుకు, ఆకాశానికంటిన ధరలను నియంత్రించి సామాన్యుల జీవితాలు ఇబ్బందులు లేకుండా సాగేందుకు, దేశం మరింతగా సమగ్రాభివృద్ధిని సాధించేందుకు మోడీ ప్రభుత్వం మరెంతో బృహత్తరమైన కృషి చేయాల్సి ఉంది. దేశంలో మరెన్నో అభివృద్ధి పనులను పరుగులెత్తించి, దేశ సమగ్రాభివృద్ధిని సాధించాల్సి ఉంది. తద్వారా 'శ్రేష్ఠ భారత్'ను సాకారం చేయాల్సివుంది.

# తెలుగు ఓటర్లు తెలివైనోళ్ళు...!

ఆరు నెలల క్రితం తెలంగాణలోనూ, తాజాగా ఆంధ్రాలోనూ జరిగిన ఎన్నికలలో తెలుగు ఓటర్లు తమ తెలివిని చూపించారు. మితిమీరిన ఆత్మవిశ్వాసం, అతి నమ్మకం మంచిది కాదని అధికార పార్టీలకి, వాటి అధినేతలకి బుద్ధి చెప్పారు. కేసీఆర్ వైఖరి నచ్చకపోయినా తెలంగాణ ప్రజలు తెరాసకి రెండో పర్యాయం అవకాశం ఇచ్చారు. అయినా, చంద్రశేఖరరావులో మార్పు రాకపోవడంతో మూడవ సారి ఓడించి ఇంటికి పంపించారు.

ఆంధ్రాలో ఆ చాన్సు ఇవ్వలేదు.. ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ 2019లో బ్రతిమిలాడిన వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి అభ్యర్ధనని ఆంధ్రులు అప్పుడు మన్నించారు. నీ పాలనతో ఒక్కసారికే కొంపలు ముంచావు స్వామీ అన్నట్లుగా రెండవ అవకాశం ఇవ్వకుండా చిత్తుగా ఓడించి అధికారం నుండి దించేశారు. గత ఎన్నికలలో 151సీట్లు ఇచ్చిన ఓటర్లు, ఈ ఎన్నికలలో జగన్ పార్టీని కేవలం 11 సీట్లకే పరిమితం చేశారు. జనం జగన్‌పైన పెట్టుకున్న అపరిమితమైన నమ్మకాన్ని గత ఐదేళ్లలో ఆయన ఎలా కాపాడుకోలేక పోయాడో, జనం కూడా జగన్ వారిపై పెట్టుకున్న అతి నమ్మకానికి తగిన స్థాయిలో బుద్ధిచెప్పారు. జగన్‌ని ఏకాకిని చేశారు. ఐదేళ్ళు నోరుపారేసుకున్న ఆయన మంత్రి వర్గ సహచరులందరినీ ఓడించి నోళ్లు మూయించారు. మాతో పెట్టుకుంటే మసే అని రెండు రాష్ట్రాల తెలుగు ఓటర్లు చెప్పకనే చెప్పారు... అందుకే వాళ్ళు తెలివైనోళ్ళు...! – యం.చంద్రమౌళి, కొత్త ఢిల్లీ.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

## అల్లూరు చెరువు గబ్బుకొట్టిపోతోంది

వేలాదిమంది రైతులకు, ప్రజలకు సాగునీరును, తాగునీరును అందిస్తున్న అల్లూరు చెరువుకు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో క్రమేణా అది మురికికూపంగా మారుతోంది. ఈ చెరువు ఎంతో విశాలంగా, చుట్టూ మట్టికట్టతో పటిష్టంగా కూడా ఉంటుంది. అయితే, రానురాను ఇది కోళ్ళ వ్యర్థాలు, చెత్తాచెదారంతో గబ్బుకొట్టిపోతోంది. ఆ కుళ్ళిన చెత్తాచెదారమంతా గాలికీ వానకీ చెరువులో కలిసిపోయి, తాగే నీళ్ళన్నీ మురుగు నీళ్ళుగా మారిపోతున్నాయి. ఆ నీళ్ళు తాగిన ప్రజలు నానా రకాల రోగాలకు గురవుతున్నారు. గత కొంతకాలంగా చెరువుకట్ట మీద వ్యర్థాలు పేరుకుపోతున్నా సంబంధిత అధికారులు కానీ, సిబ్బంది కానీ పట్టించుకోవడం లేదు. పంచాయతీ అధికారులు కానీ, నీటిపారుదల శాఖ అధికారులు కానీ చెరువుల పట్ల ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదు. జిల్లా ఉన్నతాధికారులైనా చొరవ తీసుకుని చెరువులు దొరువుల్లో ఉన్న నీళ్ళు కలుషితం కాకుండా కాపాడాలి. లేకుంటే, ప్రజలు అనారోగ్యం పాలవుతారు.

– ఆర్‌ఎస్ శేషయ్య, అల్లూరు.




# రాక్షస రాజకీయాలకి స్వస్తి పలకాలి..!

రాజకీయం అంటే.. హుందాతనం.
రాజకీయం అంటే.. రాజసం.
రాజకీయం అంటే.. గౌరవం.
రాజకీయం అంటే.. హోదా.
రాజకీయం అంటే.. దర్జా.
రాజకీయం అంటే.. స్ఫూర్తి.
రాజకీయం అంటే.. కీర్తి.
రాజకీయ రంగం అంటే.. సేవా స్ఫూర్తికి వేదిక.
రాజకీయ పదవంటే.. ప్రజల ఆశీస్సులతో లభించే అపురూప కానుక.
రాజకీయం అంటే.. పదిమందిని ఆప్యాయంగా పలకరించే మంచి మాట.
రాజకీయం అంటే.. సమాజానికి మేలుచేసే మంచి బాట.

ఎన్నికల సమయంలో వివిధ పార్టీల నుండి పోటీచేసే అభ్యర్థులు సానుకూల దృక్పథంతో వ్యవహరించేవారు.

ప్రచారంలో ఒకరికొకరు ఎదురుపడితే పరస్పరం పలకరించుకునే వారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకునేవారు.

ఒకరికొకరు 'ఆల్ ది బెస్ట్' కూడా చెప్పుకునేవారు.
ఇవన్నీ ఒకప్పటి మాట.
ఇప్పుడు...
రాజకీయాలంటే.. రోత.
రాజకీయాలంటే.. బురద.
రాజకీయాలంటే.. గలీజు.
రాజకీయాలంటే.. రాక్షసత్వం.
రాజకీయాలంటే.. అరాచకత్వం.
రాజకీయాలంటే.. దాడులు.
రాజకీయాలంటే.. దోపిడీలు.
రాజకీయాలంటే.. దుర్మార్గాలు.
రాజకీయాలంటే.. దూషణలు.
రాజకీయాలంటే.. కబ్జాలు.
రాజకీయాలంటే.. సవాళ్లు, ప్రతి సవాళ్లు.
నేటి నేతలు ప్రచారంలో ఒకరికొకరు ఎదురుపడితే...
చొక్కాలు మడుచుకుంటున్నారు.
పళ్ళు కొరుక్కుంటున్నారు.
కత్తులు నూరుకుంటున్నారు.
కళ్ళు ఉరుముకుంటున్నారు.
ఒకరినొకరు తరుముకుంటున్నారు.
జుగుప్సాకరమైన బూతులతో తిట్టుకుంటున్నారు.

ప్రజాక్షేత్రంలో గెలిచి అమాత్యులుగా ప్రమాణం చేసినవారు సైతం బూతులలో పీహెచ్‌డీ చేసినవారిలా రెచ్చిపోతున్నారు.

తాము మంత్రులమన్న సంగతి కూడా మరచి మీసాలు తిప్పి, తొడలు చరుచుకుంటున్నారు.

ఎన్నికలు ముగిసి ఫలితాలు వచ్చాక కూడా క్షేత్రస్థాయిలో పార్టీల కోసం పనిచేసిన నేతలు, కార్యకర్తలు ఒకరినొకరు శత్రువులలా చూసుకుంటున్నారు.

పరస్పరం దాడులు చేసుకుంటున్నారు.

ఆయా పార్టీల నాయకులు కూడా తమ అనుయాయులను రెచ్చగొడుతున్నారు.

మీకేమైనా మేం చూసుకుంటాం.. అని తప్పుడు హామీలతో అగ్గికి ఆజ్యం పోస్తున్నారు.

పరిస్థితి చేయి దాటిపోతుందని అనిపిస్తే.. కార్యకర్తలని గాలికి వదిలి, వాళ్ళు రాష్ట్రం దాటి పోతున్నారు.

## అరాచకంగా మారిన ఆంధ్రా రాజకీయం..!

గతంలో ఎన్నడూ లేని కొత్త రాజకీయ సంప్రదాయం గత దశాబ్ద కాలంగా ఆంధ్రాలో మొదలయ్యింది.

ఆకు రౌడీలకి, వీధి గుండాలకి, అనామకులకి, అణాకాని వ్యక్తులకి రాష్ట్ర రాజకీయ రంగం వేదికయ్యింది.

దుర్మార్గమైన రాచకీయంగా, రాక్షసత్వంగా రాజకీయం అవతరించింది.

నయా నాయకుల అరాచకాలకి, ఆగడాలకి, దోపిడీలకి, దురాగతాలకి అడ్డులేకుండా పోయింది.

అధికార దురహంకారానికి, అక్రమ సంపాదనకి హద్దులేకుండా పోయింది.
ఫలితంగా 2024 ఎన్నికలలో ఆంధ్రా ప్రజలు తమ సత్తా చూపించారు.
కలలో కూడా ఊహించని స్థాయిలో అధికారపార్టీని ఖంగు తినిపించారు.
అపరిపక్వ, అసమర్థ, అహంకారపు పాలనని మట్టి కరిపించారు.

అధికార పార్టీ నాయకుల ఆగడాలపైనా, అకృత్యాలపైనా ఓటు పోటుతో తమ నిరసనని ప్రకటించారు.

రాక్షసత్వం పోవాలి - రాజసం రావాలి...!
ఇప్పుడు కొత్తగా ఏర్పడ్డ సర్కారు గతాన్ని మరచిపోవాలి.
కక్షలు, కార్పణ్యాలకి స్వస్తి చెప్పాలి.
పగలూ ప్రతీకారాలకి ఫుల్‌స్టాప్ పెట్టాలి.
మంచి పరిపాలనకి శ్రీకారం చుట్టాలి.
స్నేహపూరిత వాతావరణానికి స్వాగతం పలకాలి.
రాజకీయాలకి మళ్ళీ రాజసం తేవాలి...!

- రాజశ్రీ



# జనం మనిషిగా ఎదిగిన నాయకుడు

- జిల్లా రాజకీయాల్లో తలవంచని ధీరుడు
- 'ఆనం'ను మరోసారి వరించిన మంత్రి పదవి



*నెల్లూరు జిల్లాలో ఆనం రాజకీయాలకు తిరుగే ఉండదన్న మాట నేటికీ నిజమవుతూనే ఉంది. ఇప్పుడు కాదు, పాతకాలంలో ఉక్కుమనిషి ఏసీ సుబ్బారెడ్డి హయాం నుంచి ఆనం వారికి రాజకీయాల్లో ఎదురులేదు. జిల్లాలోనే కాదు రాష్ట్ర రాజకీయాల్లోనూ వారి మాటకు ఎదురుండదు. పదవి ఉన్నా లేకున్నా ప్రజలతో నిత్యం సన్నిహితంగా ఉండడం ఆనం వారి నైజం. అదే వారికి సాధించిపెడుతోంది విజయం. అంతేకాదు, ఎంతటి విపత్కర పరిస్థితులు ఎదురైనా తలవంచని ధీరత్వం..అదే ఆనం వారి తత్వం. అందుకే, పడినా లేచే కడలి తరంగంలా రాజకీయరంగంలో ఆనం వారి జయపతాక ఎగురుతూనే ఉంటుంది. అందుకు తాజా తార్కాణం రామనారాయణరెడ్డి.*

ఏసీ సుబ్బారెడ్డి నుంచి ఆనం వెంకటరెడ్డి, ఆనం సంజీవరెడ్డి, ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి ఇలా ఆనం కుటుంబం నుంచి ఉద్దండులెందరో జిల్లా రాజకీయాలను శాసించారు. నాటి నుంచి నేటికీ జిల్లాలో ఆనం మార్కు రాజకీయాలతో చక్రం తిప్పి, తమకు తిరుగే లేదనిపించుకుంటున్నారు. ఆనం సంజీవరెడ్డి, ఆనం వెంకటరెడ్డిలు కూడా పాతకాలంలో శాసనసభ్యులై, మంత్రులుగా పదవులందుకున్నారు. ఆ తర్వాత, ఆనం వెంకటరెడ్డితో పాటు ఆయన కుమారులైన ఆనం వివేకానందరెడ్డి, రామనారాయణరెడ్డిలు కూడా రాజకీయ రంగంలో రాణించారు. తండ్రితో పాటు ఈ ఇద్దరు కుమారులు కూడా నెల్లూరు నియోజకవర్గం నుంచే గెలుపొంది నెల్లూరుపై తమ పట్టు బిగించారు. పలుసార్లు ఎమ్మెల్యేలై జిల్లా రాజకీయాలను గుప్పిటపట్టారు. 1983లో ఆనం వెంకటరెడ్డి, (ఆత్మకూరు నుంచి), రామనారాయణరెడ్డి (నెల్లూరు నుంచి) ఇద్దరూ ఒకేసారి పోటీచేసి గెలిచి ఎమ్మెల్యేలుగా ఉన్నారంటే ఆనం వారి సత్తా ఏమిటో తెలుస్తుంది. ఆనం రామనారాయణరెడ్డి, ఆనం వివేకానందరెడ్డి ఇద్దరూ ఒకేసారి 1999లో కాంగ్రెస్‌పార్టీ తరఫున రాపూరు నుంచి, నెల్లూరు నుంచి పోటీచేసి గెలిచి శాసనసభ్యులై జిల్లా రాజకీయాలనే కాక, రాష్ట్ర రాజకీయాలను కూడా ప్రభావితం చేశారు. ఎమ్మెల్యే పదవులు, మంత్రి పదవులు ఆనం కుటుంబానికి కొత్తకాదు. వారి సుదీర్ఘరాజకీయ జీవితంలో అలాంటి ఎన్నో మైలురాళ్ళను అధిగమించిన చరిత్ర వారికుంది.

సాధారణంగా ఏ జిల్లాలోనైనా ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో నాయకుడికి మాత్రమే పట్టు ఉంటుంది. అలాంటిది ఆనం వారికి జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో (నెల్లూరు సిటీ, రాపూరు, ఆత్మకూరు, వెంకటగిరి) ఎక్కడ నుంచి పోటీ చేసినా గెలిచే సత్తా ఉండడం అరుదైన విషయమే. అలాంటి ఉద్దండ రాజకీయనాయకుల్లో ఆనం రామనారాయణ ఒకరు. జిల్లాలో ఒకటి రెండు సార్లు కాదు, ఏకంగా ఎనిమిది సార్లు గెలిచిన ఏకైన నాయకుడు రామనారాయణే. కొంతకాలం ఆయన ఎన్టీఆర్ మంత్రివర్గంలోనూ పనిచేశారు. 2007లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంత్రివర్గంలోను, 2012లో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రివర్గంలోనూ బాధ్యతలు నిర్వర్తించారు. అందుకే ఆయన సీనియర్. 1983లో తెలుగుదేశం ఆవిర్భవించినప్పుడు నెల్లూరు నియోజకవర్గం అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీచేసి విజయం సాధించారు. 1985లో రాపూరు నుంచి గెలిచారు. 1989లో రాపూరులో ఓటమి పాలైనా, 1991లో కాంగ్రెస్‌లో చేరి 1999, 2004 ఎన్నికల్లో రాపూరు నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 1999లో ఈ జిల్లా నుంచి ఆనం కుటుంబంలో రామనారాయణరెడ్డి, వివేకానందరెడ్డి ఇద్దరూ ఎమ్మెల్యేలుగా ఉండడం విశేషం. ఆ తర్వాత, 2009లో రామనారాయణ ఆత్మకూరు నుంచి గెలిచి, మంత్రి పదవిని కైవసం చేసుకున్నారు. 2014లో ఆత్మకూరులో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. మళ్ళీ 2019లో వైకాపా అభ్యర్థిగా వెంకటగిరి నుంచి పోటీచేసి విజయం సాధించారు. తాజాగా మొన్నటి (2024) సార్వత్రిక ఎన్నికల్లో ఆత్మకూరు నుంచి పోటీచేసి విజయాన్ని కైవసం చేసుకున్నారు. వెంకటగిరి ఎమ్మెల్యేగా ఉండగా జగన్ ప్రభుత్వం తీరు నచ్చక, ఆ ప్రభుత్వాన్ని ఎదిరించి జగన్ ఆగ్రహానికి గురయ్యారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా వెనుకంజవేయకుండా మళ్ళీ ఆయన తెలుగుదేశం పార్టీలో చేరారు.

ఈసారి టీడీపీకి ఏమాత్రం అనుకూలంగా లేని ఆత్మకూరు నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి పడి లేచిన కెరటంగా ఉద్యమించారు. ఏళ్ళతరబడిగా ఆత్మకూరు పాలకులుగా ఉన్న మేకపాటి వర్గీయులను చిత్తు చేసి.. ఆనం ఘన విజయం సాధించి తమ సత్తా ఏమిటో చూపించారు. తాజాగా, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిత్వంలో మంత్రివర్గంలో జిల్లా నుంచి ఎవరికి స్థానం దొరుకుతుందోనని ప్రజలంతా ఉత్కంఠగా ఎదురు చూశారు. మంత్రి కాకాణిని మట్టికరిపించిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉద్దండుడైన ఆదాలను ఓడించిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రేస్‌లోఉన్నప్పటికీ, విజ్ఞుడు.. అనుభవజ్ఞుడు, జిల్లా రాజ కీయాల్లోనే కాక రాష్ట్ర రాజకీయాల్లోనూ కీలకపాత్ర పోషించే సత్తా ఉన్న ఆనంకే మరోసారి మంత్రి పదవి లభించింది.. దటీజ్.. ఆనం!..

ఆనం రామనారాయణరెడ్డికి 'లాయర్' శుభాకాంక్షలు.

## చంద్రబాబు ముఖ్య కార్యదర్శిగా.. రవిచంద్ర



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పదవీ ప్రమాణస్వీకారం చేసిన తర్వాత, సీఎం పేషీలో తొలి అధికారిగా ఐఏఎస్ అధికారి ముద్దాడ రవిచంద్ర నియమితులయ్యారు. కొత్త ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణం చేశాక, అదేరోజు సాయంత్రం (ఈనెల 12న) రవిచంద్రను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులను జారీచేశారు. రవిచంద్ర వెంటనే ఆ మేరకు బాధ్యతలు తీసుకోవాలని కూడా ఆదేశించారు. దీంతో ఆయన గురువారం సతీసమేతంగా తన కార్యాలయానికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. రవిచంద్ర గతంలో.. 2005 నుంచి 2008 దాకా నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా కూడా ఎంతో సమర్థవంతంగా పనిచేసి, జిల్లా ప్రజల అభినందనలు అందుకున్నారు. రవిచంద్ర సీఎం ముఖ్య కార్యదర్శి కావడం పట్ల నెల్లూరీయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## టీడీపీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి - రామ్‌కుమార్‌రెడ్డి



సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును స్వీకరిస్తున్నామని, వైకాపా కార్యకర్తలకు.. ప్రజలకు ఎల్లప్పుడు తాము అండగా ఉంటామని వెంకటగిరి వైకాపా నేత నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 12న వెంకటగిరిలోని తమ నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, 2019 ఎన్నికల్లో వైకాపా ఇచ్చిన హామీలన్నిటినీ 99 శాతం దాకా నెరేర్చిందని, టీడీపీ ఈ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ చిత్తశుద్ధితో నెరవేర్చాలని కోరారు. వైకాపా నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించినా, కక్షపూరిత చర్యలకు పాల్పడినా సహించేది లేదన్నారు.

## బెజవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్న సోమిరెడ్డి



సర్వేపల్లి నియోజక వర్గం టీడీపీ అభ్యర్థిగా ఇటీవల ఘనవిజయం సాధించిన మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల బెజవాడలోని ఇంద్రకీలాద్రి పర్వతంపై వెలసి ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఆలయ సంప్రదాయం ప్రకారం వేద పండితులు ఆశీర్వదించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీ–బీజేపీ–జనసేన కూటమికి, తద్వారా ఏర్పడనున్న ప్రభుత్వానికి అమ్మవారి అనుగ్రహం ఉండాలని ప్రార్థించినట్లు సోమిరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు.

## ముఖ్యమంత్రిగా.. చంద్రబాబు ప్రమాణస్వీకారం

## కళ్ళారా వీక్షించిన నెల్లూరుజిల్లా ప్రజలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ఉదయం గన్నవరంలో ప్రమాణస్వీకారం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ సమక్షంలో పెద్ద ఎత్తున జరిగిన ఈ కార్యక్రమాన్ని జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఎల్‌ఈడి స్క్రీన్ల ద్వారా ప్రజలు లైవ్‌లో వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అంతా పండుగ వాతావరణం కనిపించింది.

జిల్లావ్యాప్తంగా 12 ప్రదేశాల్లో ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటుచేశారు. నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్క్రీన్లపై ప్రమాణస్వీకార కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, డిఆర్‌వో లవన్న అధికారులతో కలిసి వీక్షించారు. అలాగే నెల్లూరు నగర పరిధిలోని కోటమిట్ట షాదీమంజిల్, స్టోన్‌హౌస్‌పేటలోని బీవీఎస్ హైస్కూలు, గాంధీబొమ్మ సమీపంలోని స్వతంత్ర పార్కు, నెల్లూరురూరల్ మండల పరిధిలోని కస్తూర్బా కళాక్షేత్రం, నగరంలోని మాగుంటలేఅవుట్ అనిల్‌గార్డెన్స్‌లో సీఎం ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో ప్రజలు వీక్షించారు.

# జెఇఇలో 'విశ్వసాయి' జయభేరి



జేఇఇ అడ్వాన్స్డ్ ఫలితాల్లో నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. జాతీయస్థాయిలో తమ విద్యార్థులు వై.శరణ్యేష్ 3430, దివ్యశ్రీ 5333, ఎన్.కార్తీక్ 1430, సిద్ధార్థమౌర్య 4316 ర్యాంకులను సాధించారని కళాశాల ఛైర్మెన్ డా.సత్యనారాయణ తెలిపారు. ఈనెల 9న కళాశాలలో జరిగిన సభలో ఆయన పాల్గొని విజేతలైన విద్యార్థులను అభినందించారు. తాము రూపొందించిన వత్తిడి లేని విద్యావిధానం, అయిదంచెల బోధనా కార్యక్రమాల ద్వారా ఎంపీసీలో కూడా మంచి ఫలితాలు సాధిస్తున్నామని, విశ్వసాయి విద్యా సంస్థలు బైపీసీలోనూ, ఎంపీసీలో కూడా విశేష కృషి చేస్తున్నాయనడానికి ఈ ఫలితాలే నిదర్శనమని, విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన తల్లి తండ్రులు, అధ్యాపకులకు ఆయన ఈ సందర్భంగా తన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# జెఇఇలో సత్తా చాటిన..'నారాయణ'



తాజాగా విడుదలైన ఐఐటీ జేఇఇ అడ్డాన్స్ ఫలితాల్లో నెల్లూరు హరనాథపురంలోని నారాయణ ఐఐటి అకాడమీ విద్యార్థులు తమ సత్తా చాటుకుంటూ జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. అన్ని కేటగిరీల్లోనూ వరుసగా 1,2,3,4,6,11 ర్యాంకులను నారాయణ విద్యార్థులు కైవసం చేసుకోవడం సంచలనం కలిగించింది. ఓపెన్ కేటగిరీలో తమ విద్యార్థులు సూరజ్ 134, సుబ్రహ్మణ్య కల్యాణరామ్ గణేష్ 1138, సాయినితీష్ 1664, శ్రీనికేష్ 1949, రితేష్‌రెడ్డి 2177, లావణ్య చంద్రిక 2554, చక్రేష్ 2976 ర్యాంకులను సాధించారని నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 9న అకాడమీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ విద్యార్థులను ఆయన అభినందించారు.

## ఏపీఇఏపీ సెట్‌లో..


ఈనెల 11న విడుదలైన ఏపీఈఏపీ సెట్‌లో నెల్లూరులోని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. తమ నిర్వహణలోని అన్ని సంస్థల్లో రాష్ట్రస్థాయిలో 3,6, 9,15,17 ర్యాంకులు తమ కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారని నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. నెల్లూరులో తమ విద్యార్థులు షేక్ సూరజ్ 15వ ర్యాంకు, ఏ.శ్రీనికేష్ 253, టి.భువనేశ్వరి 358, బి. శ్రీకాంత్ 460, పూర్ణసాయి నితీష్ 499వ ర్యాంకు, వి.సంతోష్‌రెడ్డి 778వ ర్యాంకు, ఓ.చక్రేష్ 947వ ర్యాంకు సాధించారని, 500లోపు ర్యాంకులు అయిదుగురు, 1000లోపు ఏడుగురు, 2000లోపు 19 మంది, 3000లోపు 34మంది ర్యాంకులు పొందడం ఆనందంగా ఉందంటూ, విద్యార్థులను ఆయన అభినందించారు.

# నెల్లూరు కబుర్లు

## రామోజీ మరణం..

# తెలుగుజాతికే తీరని లోటు

### వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు



ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మరణం తెలుగుజాతికే తీరని లోటని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామోజీరావు మృతి పట్ల వారు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉన్నత విలువలతో, ఉత్తమ ప్రమాణాలతో మీడియా రంగంలో అనేక సంస్కరణలు తెచ్చిన రామోజీరావు మరణం బాధాకరమన్నారు. నైతిక విలువలకు పెద్దపీట వేస్తూ రామోజీరావు అనేక రంగాల్లో అత్యున్నత శిఖరాలను అధిరోహించారని, రామోజీ ఫిల్మ్ సిటీ, మార్గదర్శి, ప్రియ, ఈనాడు, ఈటీవీ వంటి సంస్థల ద్వారా వేలాదిమందికి ఉపాధినిస్తున్నారని, అంతటి ఘనమైన రామోజీరావు సేవలు.. తెలుగు జాతి ఉన్నంతవరకు ఎప్పటికీ నిలిచే వుంటాయన్నారు. తుపానులు, కరువు, వరదలు వంటి ప్రకృతి విపత్తుల్లో, కరోనా సమయంలో ఈనాడు సంస్థల తరపున రామోజీరావు చేసిన సేవా కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోతాయని పేర్కొన్నారు.కలమే ఆయుధంగా సమాజ మార్పు కోసం ఆయన అహర్నిశలు శ్రమించారని ప్రస్తుతించారు. కళలు, పర్యాటకం, ఆతిథ్యం, జర్నలిజం వంటి వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన రామోజీరావు మృతి తెలుగురాష్ట్రాలకే కాదు.. యావత్ దేశానికే తీరని లోటని అంటూ తమ నివాళులర్పించారు.

# డాక్టర్ బిందుమీనన్‌కు..అరుదైన గౌరవం



ప్రముఖ వైద్య నిపుణురాలు, నెల్లూరు అపోలో ఆసుపత్రి న్యూరాలజీ విభాగం అధిపతి డాక్టర్ బిందుమీనన్ ప్రపంచ బ్రైన్‌స్ట్రోక్ ఆర్గనైజేషన్ బోర్డు డైరెక్టర్‌గా ఎంపికయ్యారని అపోలో డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ తెలిపారు. ఇటీవల ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 'అడ్వొకసీ లీడర్‌షిప్ ఫోరం'లో కూడా డాక్టర్ బిందుమీనన్ ఎంపిక కావడం ఆమె ప్రతిభాపాటవాలకు నిదర్శనమన్నారు. తనకు ఈ గౌరవం దక్కేందుకు అపోలో ఆసుపత్రి యాజమాన్యం ఎంతగానో సహకరించిందంటూ ఈ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ బిందుమీనన్ చెప్పారు.

# టోనీబాబు అన్నదానం

జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్, జనసేన అభ్యర్థులు సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించడంతో ఆంధ్రరాష్ట్ర పవన్‌కల్యాణ్ అభిమాన సంఘం అధ్యక్షుడు పోతురాజు టోనీబాబు ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు ప్రాంతంలో నిరుపేదలకు అన్నదానం చేశారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి ధ్యేయం కావాలి

### ఉప రవాణా కమిషనర్ చందర్



మానవ మనుగడకు ప్రాణప్రదమైన పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, పచ్చదనం-పరిశుభ్రత అందరి ధ్యేయం కావాలని ఉప రవాణా కమిషనర్ చందర్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇటీవల నెల్లూరులోని తమ కార్యాలయం ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. పచ్చని చెట్లు-ప్రగతికి మెట్లు అని ఆయన అంటూ, ప్రకృతిని కలుషితం చేసుకోకుండా కాపాడుకుంటేనే అందరికీ స్వచ్ఛమైన ప్రాణవాయువు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆర్టీఓ మురళీమోహన్, మోటర్ వాహనాల తనిఖీ అధికారులు బాలమురళీకృష్ణ, షేక్ బాబు, కార్తీక్ పవన్‌కుమార్, రాంబాబు, గోపి నాయక్, సహాయ మోటార్ వాహనాల తనిఖీ అధికారులు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, కావలి వాహన తనిఖీ అధికారులు సుందర్‌రావు, కరుణాకర్, కందుకూరు వాహనాల తనిఖీ అధికారి మహమ్మద్ షేక్ రఫీ, ఆత్మకూరు వాహనాల తనిఖీ అధికారి రాములు, పరిపాలనాధికారులు కిషోర్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ జెట్టి శేషారెడ్డి స్మారక సదస్సు..16న

ప్రజావైద్యులు డాక్టర్ జెట్టి శేషారెడ్డి స్మారక సదస్సు ఈనెల 16న నెల్లూరులోని డా.జెవిస్ విజ్ఞానకేంద్రంలో నిర్వహించనున్నట్లు ప్రజారోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవి రమణయ్య తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు 'భారత రాజ్యాంగం-విలువలు-సవాళ్ళు' అనే అంశంపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టి.రజని ఉపన్యసిస్తారని, 'ఆరోగ్యహక్కు చట్టం-ఏపీ 2024' అనే అంశంపై ప్రజారోగ్య ఉద్యమ సమన్వయకర్త డాక్టర్ టి.సుందరరామన్ ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

## జాతీయస్థాయి ఎన్‌సిసి శిక్షణకు..

# ఇద్దరు కెఎన్ఆర్ కేడెట్లు



జాతీయస్థాయిలో నిర్వహించనున్న ఎన్‌సిసి శిక్షణకు నెల్లూరు భక్తవత్సలనగర్‌లోని కెఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల ఎన్‌సిసి కేడెట్లు ఎంపిక కావడం విశేషం. 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి నెల్లూరు లెఫ్టినెంట్ కమాండర్, కమాండింగ్ ఆఫీసర్ గణేష్ గొడంగవే ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి 24వ తేదీ వరకు 10 రోజులపాటు గుంటూరు కెఎల్ యూనివర్సిటీలో జాతీయస్థాయిలో కేడెట్లకు శిక్షణ ఇవ్వనున్నారు. 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్' ధ్యేయంగా జరిగే ఈ శిక్షణా శిబిరానికి కెఎన్ఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల నేవల్ ఎన్‌సిసి నుంచి ప్రతిభావంతులైన షేక్ సాధిక ఫిర్దోస్, కాకాణి భవ్యశ్రీలు ఎంపికయ్యారని ఆ పాఠశాల అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు తెలియజేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.విజయ్ ప్రకాష్‌రావు కేడేట్లను అభినందించారు. ఈ శిక్షణా శిబిరంలో దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ సాంస్కృతిక వైభవం, సంస్కృతి సంప్రదాయాలు, వారసత్వ సంపద, కళలు, క్రీడలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణా శిబిరంలో సుమారు ఆరువందల మంది ఎన్‌సిసి కేడేట్లు వివిధ రాష్ట్రాల నుంచి హాజరుకానున్నారు. ఆ ప్రతిష్టాత్మకమైన శిక్షణా శిబిరానికి తమ పాఠశాల కేడేట్లు ఎంపికవడం తమకెంతో గర్వకారణమని ఆయన పేర్కొన్నారు.

# గిరిజన విద్యార్థులకు బ్యాగుల బహుకరణ

జిల్లాలో 10వ తరగతిలో 500 మార్కులకు పైబడి మార్కులు సాధించిన గిరిజన విద్యార్థులకు ఐటీడీఏ పీఓ డాక్టర్ మందా రాణి ఈనెల 11న బ్యాగులు బహుకరించారు. విద్యార్థులు బాగా చదువుకుని సమాజంలో ఉత్తమం రాణించాలని ఆమె ఈ సందర్భంగా ఆకాంక్షించారు. నెల్లూరులోని ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు జిల్లాల గిరిజన సంక్షేమాధికారులు పాల్గొన్నారు.




# రైల్వేస్టేషన్ పనులను పరిశీలించిన ఏజీఎం



నెల్లూరులోని ప్రధాన రైల్వేస్టేషన్ పనులను రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ఆర్. ధనుంజయులు ఈనెల 11న పరిశీలించారు. ప్రయాణీకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను పూర్తిచేయాలని సూచించారు. సబ్ వే పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుపుకున్నారు. ఆయన వెంట అదనపు డివిజినల్ రైల్వే మేనేజర్ కె.శ్రీనివాసరావు, కమర్షియల్ మేనేజర్ వి.రాంబాబు, డివిజన్ అధికారులు డి.నరేంద్రవర్మ, కృష్ణ తదితరులున్నారు.

## 'అభివృద్ధి మంత్రమే' గెలిపించింది..

# మళ్ళీ మంత్రిగా దీవించింది

### • నారాయణ జీవిత ప్రస్థానం.. 'కష్టే ఫలీ'కి నిదర్శనం





*ఆసియాలో అతిపెద్ద విద్యాసంస్థలు.. నారాయణ విద్యాసంస్థలన్నది అందరికీ తెలిసిందే. విద్యారంగంలో నారాయణ సాధించిన విజయాలు బోలెడన్ని. అయితే, రాజకీయ రంగంలోకి వచ్చాక ఆయన ఎదుర్కొన్న ఒడిదుడుకులు కూడా లెక్కలేనన్ని. వైకాపా ప్రభుత్వం చేతిలో నానా కష్టాలకు గురైనా, అన్నిటినీ నిబ్బరంగా ఎదరించి నిలిచారు. నెల్లూరు నగర ప్రజల ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలిచి.. రెండోసారి నేడు మళ్ళీ మంత్రిగా తన పదవి నిలుపుకున్నారు.*

నారాయణంటే.. చిన్నతనం నుంచి కష్టాలు చవిచూసిన వ్యక్తిగా అందరికీ తెలుసు. నెల్లూరులో ఒక చిన్న కోచింగ్ సెంటర్ పెట్టుకుని జీవితం గడిపిన నారాయణ నేటికీ నాటి జీవితాన్ని మరచిపోలేదు. పాతమిత్రులకు ఆయన ఇప్పటికీ ఆప్తునిగానే ఉన్నారు. కాలక్రమంలో కష్టాన్నే నమ్ముకుని.. అసామాన్య ప్రతిభా పాటవాలతో విద్యారంగంలోనే ఆణిముత్యం లాంటి విద్యాసంస్థలను వృద్ధి చేసి, 'నారాయణ విద్యాసంస్థల' పేరుతో దేశవ్యాప్త ఖ్యాతిని సాధించిన అనితర సాధ్యుడు.. నిత్య కృషీవలుడు నారాయణ. వాస్తవానికి, ఆయన జీవితం పూలపాన్పు కాదు. ఎన్నో కష్టనష్టాలు జీవితంలో ఎదురయ్యాయి. అయినా, అన్నిటినీ చిత్త శుద్ధితో, లక్ష్యసిద్ధితో అధిగమించారు. పేదరికం నుండి ఒక్కో మెట్టు ఎక్కి విజయ శిఖరాలకు చేరుకున్నారు. విద్యారంగంలోనే కాక, రాజకీయరంగంలోనూ రాణిస్తూ తన ప్రత్యేతకను చాటుకుంటున్నారు. గతంలో చంద్రబాబునాయుడు నాయకత్వంలోని టీడీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపల్ పాలన, పట్టణాభివృద్ధి, పట్టణ గృహనిర్మాణ శాఖల మంత్రిగా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. తాజాగా ఆయన రెండవసారి కూడా చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో స్థానం సంపాదించారు. ఒక్కమాటలో చెప్పాలంటే 'కష్టే ఫలీ'కి అనే నానుడికి నారాయణ నిదర్శనంగా నిలిచారు.

### సమాజసేవ కోసం రాజకీయాల్లోకి :

సమాజానికి చేయాలన్న తపనతో ఆయన రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్ఫూర్తితో రాజకీయాల్లో రాణించారు. 1998లో తొలుత టీడీపీ సర్వే విభాగానికి తన మేధోశక్తిని వినియోగించిన నారాయణ క్రమంగా క్రియాశీల రాజకీయాల వైపు అడుగులు వేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రతిపక్ష పాత్రకే పరిమితం అయిన టీడీపీ వెన్నంటి ఆయన చేసిన సేవలు అపారం. అయితే ఆ కష్టకాలంలో పార్టీకి వెన్నుదన్నుగా నిలవడంతో పాటు ప్రజల శ్రేయస్సు కోసం పాటుపడే నారాయణ తపన, పట్టుదల చూసి ఆయన్ని చంద్రబాబు ఎంతగానో ప్రోత్సహించారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో చంద్రబాబు, నారాయణకు మంత్రివర్గంలో స్థానం కల్పించారు. కొత్త రాష్ట్రం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడంలో కూడా నారాయణకు భాగస్వామ్యం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్, పట్టణాభివృద్ధి శాఖలతో పాటు నూతన రాజధాని అమరావతి నిర్మాణంలోనూ నారాయణ కీలకపాత్ర పోషించే అవకాశం కల్పించారు. ఆ సందర్భంలో నెల్లూరు నగరాన్ని ఆయన అభివృద్ధి బాట పట్టించారు. భూగర్భ డ్రైనేజీ పథకం, టిడ్కో ఇళ్ళ నిర్మాణాలతో నగరాన్ని నందనవనం చేయాలని ఎన్నో బృహత్తర ప్రణాళికలు రచించారు.

అయితే... 2019 ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆ పథకాలన్నీ మధ్యలోనే నిలిచిపోయాయి. జగన్ ప్రభుత్వం వచ్చాక టీడీపీ నేతలపై కక్ష సాధింపు ప్రారంభమైంది. టీడీపీకి అండగా ఉంటున్న నారాయణను అడుగడుగునా ఇబ్బందులు పెట్టారు. అనేకసార్లు ఆయన సంస్థలు, విద్యాలయాలు - వైద్యాలయాలపై దాడులు చేయించారు. చిత్తూరు జిల్లాలో 10వ తరగతి ప్రశ్నాపత్రం లీకైందంటూ నారాయణ అందుకు కారకుడుగా నిందలు వేసి కేసులు పెట్టించారు. విచారణల పేరుతో రేయింబవళ్ళు వేధించారు. అయినా, అన్నిటినీ ఓర్చుకుని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగారు. నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా నిలిచి, ప్రజల ఆశీస్సులతో మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచారు. ఆయన చేసిన అభివృద్ధి పనులే ఆయన్ను గెలిపించాయి. రెండోసారి మంత్రి అయిన నారాయణకు 'లాయర్' శుభాభినందనలు.

### ఒకప్పట్లో నెల జీతం..120 రూపాయలే :

1956 జూన్ 15న నెల్లూరులోని హరనాథపురంలో జన్మించిన నారాయణకు చిన్నతనం నుంచి చదువుపై ఎంతో ఆసక్తి. కష్టపడి ఉన్నత చదువులు కూడా చదివారు. ఆయన తండ్రి ఓ ప్రైవేటు బస్ కండక్టర్. బాల్యమంతా పేదరికంలో గడిచింది. అయితే, విద్యలో ఎన్నడూ వెనకబడలేదు. చదివిన ప్రతి క్లాస్‌లో ఆయనే ఉత్తమ విద్యార్థిగా మన్ననలు పొందారు. కాలేజీలో చదివేటప్పుడే ట్యూషన్లు చెప్పేవారు. చిన్నపిల్లలే కాదు, తన క్లాస్ విద్యార్థులు, సీనియర్లు కూడా నారాయణ ట్యూషన్‌కి వచ్చేవాళ్ళు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తయిన వెంటనే ఆయన నెల్లూరులోని వి.ఆర్ కాలేజీలో పార్ట్ టైం లెక్చరర్‌గా పనిచేశారు. అప్పుడు ఆయన గంటపాటు పాఠం చెబితే నాలుగు రూపాయలు ఇచ్చేవాళ్ళు. అలా మూడు నెలలు పనిచేస్తే 120 రూపాయలు జీతం మాత్రమే దక్కింది. ఎంఎస్‌సి పూర్తిచేసి పిహెచ్‌డి చేశాక, 1977లో సాంఖ్యకశాస్త్రం (స్టాటిస్టిక్స్)లో బంగారుపతకం సాధించారు. 1979లో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. అప్పట్లో ఓ చిన్న అద్దె గదిలో నారాయణ ట్యూషన్ సెంటర్ మొదలైంది. నెల్లూరు హరనాథపురంలో ఏర్పాటైన ఈ ట్యూషన్ సెంటర్ మొదట కేవలం అయిదుగురు విద్యార్థులతో ప్రారంభమైంది. అనతి కాలంలోనే ఓ కోచింగ్ సెంటర్‌గా రూపుదిద్దుకుంది. ఆ తర్వాత విద్యారంగంలోనే వటవృక్షంలా పెరిగి వేలాదిమందికి నీడనిచ్చింది. ఎన్నో విద్యాసంస్థలు, మెడికల్ కళాశాల, దంత కళాశాల వంటి విద్యానిలయాలను స్థాపించి, ఆయన విద్యారంగానికి ఎనలేని సేవలందిస్తున్నారు. దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో ఎన్నో పాఠశాలలు, కళాశాలలు స్థాపించిన ఘనత నారాయణ విద్యాసంస్థల అధిపతిగా డా.పొంగూరు నారాయణకే దక్కింది.



## చిరువ్యాపారులకు నారాయణ చేయూత

నెల్లూరులోని 18 మంది చిరువ్యాపారులకు చేయూతగా డా. నారాయణ ఇటీవల తోపుడు బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తమ మీద, పార్టీ మీద నమ్మకంతో అత్యధిక మెజార్టీ అందించిన ప్రజల రుణం తీర్చుకునేవిధంగా కృషిచేస్తామని చెప్పారు. చిరువ్యాపారుల జీవనోపాధులు సరిచేసేవిధంగా తమ సొంత నిధులతో సహాయసహకారాలు అందజేస్తామన్నారు.

### కార్యకర్త కుటుంబానికి రూ.50వేల సాయం

ఇటీవల అనారోగ్యంతో మరణించిన తెలుగుదేశం కార్యకర్త బాబు భార్య రహంతున్నీసాకు 50 వేల రూపాయలను డా. నారాయణ చెక్కు రూపంలో అందజేశారు. అనంతరం ఆయన నెల్లూరు రూరల్‌లో టీడీపీ అభ్యర్థులుగా విజయం సాధించిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యాలయానికి వెళ్ళి ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా నారాయణను కోటంరెడ్డి సోదరులు శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డిలు ఘనంగా స్వాగతించారు.

## 13 నుంచి... శ్రీ చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు



కోవూరు నియోజకవర్గం.. ఇందుకూరుపేట మండలం గంగపట్నం పంచాయతీలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ చాముండేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. అందుకు సంబంధించిన గోడ పత్రికలను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఈనెల 11న విజయవాడలోని తమ నివాసంలో ఆవిష్కరించారు. వేమిరెడ్డి దంపతుల నివాసానికి చేరుకున్న ఇందుకూరుపేట మండలం యువనాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, టీడీపి నాయకుడు రావెళ్ళ వీరేంద్ర నాయుడితో పాటు ఇతర నాయకులు.. బ్రహ్మోత్సవాల గోడ పత్రికలను, కరపత్రాలను వేమిరెడ్డి దంపతుల చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. 21వ తేదీన కల్యాణోత్సవం, 22న వసంతోత్సవం, 23న రథోత్సవం, 24న తెప్పోత్సవంతో ఉత్సవాలు పూర్తవుతాయని వారు తెలిపారు.






# నవ్యాంధ్రలో నవోదయం!

(మొదటిపేజీ తరువాయి)

***అడుగుతీసి అడుగేయాలంటే భయం. పెదవి విప్పి మాట్లాడాలంటే భయం. కొత్తగా వ్యాపారం మొదలు పెట్టాలంటే భయం. సొంత ఇల్లు కట్టుకోవాలంటే భయం. కోరిన బ్రాండు మందు తాగాలంటే భయం. చివరికి ఊపిరి పీల్చాలన్నా భయం. ఏ పని చేయాలన్నా భయం... భయం... భయం...! అలాంటి దుర్భర పరిస్థితి నుండి ఆంధ్రులకి విముక్తి లభించింది. గత అయిదేళ్లగా అభద్రతా భావంతో, అంతర్మథనానికి లోనైన ఆంధ్ర ప్రజలకి అసలైన స్వాతంత్రం వచ్చింది. కోటి ఆశలతో కొత్త ప్రభుత్వానికి జై కొట్టిన ప్రజలకి అండగా మేమున్నాం అంటూ భరోసా కల్పిస్తూ కూటమి ప్రభుత్వం కొలువయ్యింది.***

**జూన్-12, 2024..**

రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసిన రోజు, నవ్యాంధ్ర ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాల్గవసారి ముఖ్యమంత్రిగా పదవీ ప్రమాణస్వీకారం చేసిన రోజు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, యువనేత లోకేష్‌తో సహా 24 మంది మంత్రులతో కొత్త మంత్రివర్గం కొలువుదీరిన రోజు, సాక్షాత్తూ భారత ప్రధాని నరేంద్రమోడీతో పాటు, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ చీఫ్‌జస్టిస్ ఎన్వి రమణ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సహా అనేకమంది సినీ, వ్యాపార దిగ్గజాలు, వేలాదిమంది ప్రముఖుల సమక్షంలో జరిగిన ప్రమాణస్వీకారోత్సవం.. నవ్యాంధ్రకే నవోదయంగా అందరినీ ఆనందపరవశుల్ని చేసింది. గన్నవరం సమీపంలోని కేసరపల్లి వద్ద జరిగిన ఈ ఉత్సవం మహోజ్వల జన చైతన్యానికి సంకేతంగా నిలిచింది. ఒక్క విజయవాడలోనే కాదు నవ్యాంధ్రలో వాడవాడలా ప్రజల హృదయాల్లో ఆనందాతిరేకాల్ని నింపింది. ఎంతో సంబరంగా, ఎంతో హుందాగా, ఎంతో ధీరగంభీరంగా సాగిన ఈ ప్రమాణస్వీకారోత్సవంలో మెగాస్టార్ చిరంజీవి, సూపర్‌స్టార్ రజనీకాంత్, యువరత్న బాలకృష్ణ, సినీనటులు రామ్‌చరణ్, నాగబాబుతో పాటు చిరంజీవి కుటుంబ సభ్యులు, నందమూరి కుటుంబసభ్యులు, వేలాదిమంది ప్రజలు, అభిమానుల ఆనందోత్సాహాల మధ్య కొత్త మంత్రివర్గం ప్రమాణస్వీకారం చేయడం నవ్యాంధ్ర చరిత్రలోనే ఒక అపూర్వ ఘట్టం.

ఎన్టీఆర్ కుటుంబసభ్యులు అనేకమంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి, ఆమె సోదరి.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, లోకేశ్ సతీమణి బ్రాహ్మణి.. ఇలా ఎందరో ముఖ్యులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు విచ్చేసి కన్నులపండువగా జరిగిన ఈ ప్రమాణస్వీకారోత్సవాన్ని ఆద్యంతం కళ్లారా వీక్షించారు.

## మెగా డీఎస్సీపై..

## తొలి సంతకం

### చరిత్రలో నిలిచిపోయేలా 5 సంతకాలు

జూన్ 13వ తేది గురువారం సాయంత్రం 4.41 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెలగపూడి సచివాలయంలోని మొదటిబ్లాక్ లోని తన ఛాంబర్‌లో.. బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ఫైలుపై చంద్రబాబు తొలి సంతకం చేశారు. 16,437 టీచర్ పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. వాటిలో ఎస్‌జీటీ పోస్టులు 6371, పీఈటీలు 132, స్కూల్ అసిస్టెంట్‌లు 7725, టీజీటీ 1781, పీజీటీ 286, ప్రిన్సిపాల్స్ పోస్టులు 52 ఉన్నాయి. అదేవిధంగా, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు ఫైలుపై సీఎం రెండో సంతకం చేశారు. సామాజిక పింఛన్లు రూ. 4వేలకు పెంచుతూ మూడవ సంతకం, అన్న క్యాంటీన్ల రద్దుపై నాల్గవ సంతకం, నైపుణ్య గణనపై 5వ సంతకం చేశారు.

## కొత్తమంత్రులు.. వీరే..

రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్యమంత్రి చేత, మంత్రుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కొణిదల పవన్‌కల్యాణ్, నారా లోకేష్, కింజరపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, సత్యకుమార్ యాదవ్, డా. నిమ్మల రామానాయుడు, ఎన్.ఎం.డి ఫరూఖ్, ఆనం రామనారాయణరెడ్డి, పయ్యావుల కేశవ్, అణగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, డా. డోలా బాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేష్, గుమ్మడి సంధ్యారాణి, బిసి జనార్ధనరెడ్డి, డి.జి.భరత్, ఎస్.సవిత, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్, మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు.



## ఐఏఎస్, ఐపిఎస్‌లకి క్లాసు పీకిన బాబు..!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొన్ని గంటలలోపే చంద్రబాబు తన మార్కు పాలనకి శ్రీకారం చుట్టారు. సచివాలయంలో వివిధ విభాగాల అధిపతులుగా ఉన్న ఐఏఎస్, ఐపిఎస్ అధికారులతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. తాను 1995లో తొలిసారిగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోజు ఐఏఎస్, ఐపిఎస్ అధికారులంటే తనకు చాలా గౌరవం ఉండేదని అన్నారు. గత అయిదేళ్ళుగా ఆ వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందని, గతం గురించి అందరూ ఒకసారి ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. అఖిలభారత సర్వీసు అధికారులు కూడా ఇలా వ్యవహరిస్తారని తానెప్పుడూ ఊహించలేదన్నారు. రాబోవు ఐదేళ్లలో మళ్ళీ ఐఏఎస్, ఐపిఎస్‌లను గాడిలో పెడతానని హెచ్చరించారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులకి బానిసలలా వ్యవహరించిన అధికారులు జాగ్రత్తగా ఉండండి అన్నట్లుగా ఆయన సంకేతాలు ఇచ్చారు. త్వరలో శాఖల వారీగా అందరినీ విడివిడిగా కలుస్తానని కూడా చెప్పారు.



# అమరావతి రైతుల ఉద్యమం స్ఫూర్తిదాయకం

## భారత పూర్వ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు

అమరావతి ఉద్యమం గొప్ప జీవిత పాఠమని. అమరావతి రైతులు, మహిళలు, ఇతర వర్గాల ప్రజల త్యాగం స్ఫూర్తిదాయకమని భారత పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ విజయవాడ ఛాప్టర్, ఆత్కూర్‌లో స్వయం ఉపాధి శిక్షణ పూర్తి చేసుకున్న యువతీయువకులకు ఈనెల 13వ తేది గురువారం ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అమరావతి రాజధాని కోసం భూములిచ్చిన రైతులు, మహిళలు, ఇతర వర్గాల ప్రజలు 1631 రోజుల పాటు శాంతియుతంగా ఉద్యమం చేయడం గొప్పవిషయమన్నారు. స్వాతంత్ర్యోద్యమం తర్వాత అంత గొప్పగా, శాంతియుతంగా జరిగిన ఉద్యమం ఇదేనన్నారు. అలుపు లేకుండా, ఎన్ని అడ్డంకులు ఆటంకాలు ఎదురైనా పట్టుదలతో ఆ చరిత్రాత్మక ఉద్యమాన్ని నిర్వహించారంటూ కొనియాడారు.

### రాజధాని లేని రాష్ట్రం తల లేని మొండెం లాంటిది

రాజధాని లేని రాష్ట్రం తలలేని మొండెం వంటిదని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు స్పష్టం చేశారు. "ముఖ్యమంత్రి మాటిచ్చినట్లు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తారని విశ్వసిద్దామన్నారు. తాను గతంలో కూడా రాజధాని ఒకటే ఉండాలని, ఒక చోటే ఉండాలని, చట్టసభ, పాలన వ్యవస్థ వంటి వన్నీ ఒక చోట ఉంటేనే సమన్వయంతో కలిసి పని చేయడానికి వీలవుతుందని చెప్పానన్నారు. అభివృద్ధిని వికేంద్రీకరించాలని, రాజధానిని మాత్రం కేంద్రీకరించాలని, అన్నింటికీ కేంద్రంగా రాజధాని ఉండాలని, జిల్లాలతో రాజధాని అనుసంధానం జరగాలని ఆయన వివరించారు. ప్రతి జిల్లా, ప్రతి ప్రాంతం అభివృద్ధి చెందాలన్నారు. ప్రాంతీయ అసమానతలుండకూడదని, సమతుల్యం పాటించాలని, అసమానతలుంటే వాటిని తొలగించుకుని సమైక్యంగా ముందుకెళ్లాలని సూచించారు.

### యువత రాజకీయాల్లోకి రావాలి

యువతరం రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందని వెంకయ్యనాయుడు అంటూ, యువతలో నిజాయతీ ఉంటుందని, వారొస్తే రాజకీయాలు బాగుపడతాయని అభిప్రాయపడ్డారు. రాజకీయాలంటే ఈసడించుకునే పరిస్థితిని కొంత మంది నేతలు తీసుకొచ్చారని, బూతులు మాట్లాడే వారికి పోలింగ్ బూత్‌లలో సమాధానం చెప్పాలని తాను గతంలో అనేక వేదికల్లో చెప్పానని, ఇటీవల ఎన్నికల ఫలితాల్లో అందరూ ఈ విషయాన్ని గమనించినట్లున్నారని ఆయన అన్నారు., అవినీతికి పాల్పడేవారికి, శాసనసభల్లో ఇష్టానుసారం వ్యవహరించేవారికి, అరాచకాలకు పాల్పడే వారికి ప్రజలు అవకాశం వచ్చినప్పుడు తగిన గుణపాఠం చెబుతారని, ఈ విషయాన్ని నేతలు గుర్తుంచుకోవాలని ఆయన హితవు పలికారు. ఇటీవల కాలంలో రోడ్లు, చెరువులు ఆక్రమించేస్తున్నారని, అది మంచిపద్ధతి కాదని ఆయన అంటూ, ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.



### రామోజీ నుంచి ఎంతో నేర్చుకున్నా

రామోజీరావు నుంచి తానెంతో నేర్చుకున్నానని వెంకయ్యనాయుడు ఆయన్ను గుర్తు చేసుకున్నారు. 'స్వయం కృషితో పైకొచ్చి, వేల మందికి ఉద్యోగాలిచ్చిన గొప్ప వ్యాపారవేత్త, దేశమంతా గర్వించే స్థాయిలో ఫిలింసిటీని ఏర్పాటు చేసిన రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. ఈ సందర్భంగా రామోజీరావుకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఒక నిమిషం మౌనం పాటించారు.



# అక్షరాన్ని ఆయుధంగా మలిచాడు..

# జనచైతన్యానికి బావుటాగా నిలిచాడు

- తెలుగునేలపై వెలుగుల దివిటీగా వెలిగిన 'ఈనాడు' రామోజీరావు
- జీవితాన్నే అక్షరతూణీరం చేసిన మహా రుషి.. ఇక లేరు
- ఆయన అస్తమయంతో ఒక మహాశిఖరం ఒరిగిపోయినట్లయింది

## చరితార్థుని జీవితం.. చరిత్రగా మిగిలింది...!


***ఆయన అక్షరాన్ని ఆయుధంగా మార్చాడు. అక్షరానికి ప్రశ్నించడం నేర్పాడు. తద్వారా జనచైతన్యానికి జయకేతనమై నిలిచాడు. ఆయనో మహర్షి..అక్షర తపస్వి. ఆయనే 'ఈనాడు' రామోజీరావు. పాత్రికేయరంగంలో అనితరసాధ్యమైన ప్రస్థానం ఆయనది. కృషి, పట్టుదల, క్రమశిక్షణలతో ఒక్కొక్క మెట్టూ ఎదుగుతూ, తెలుగుపత్రికారంగానికే తలమానికంగా నిలిచారు. కలాన్ని కరవాలంగా చేసి దుర్నీతులు, దురన్యాయాలను ఎండగట్టారు. ఎన్నో ఉద్యమాలకు ఊపిరులూదారు. కష్టనష్టాలెన్ని ఎదురైనా ఆత్మవిశ్వాసంతో అధిగమిస్తూ, తలవంచని ధీరునిలా గుండెధైర్యంతో ముందుకు సాగారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా రేయింబవళ్ళు అలుపెరగని అక్షరయోధునిగా..తెలుగునేల నాలుగు చెరగులా ఏనాటికీ వసివాడని అక్షరపుష్పాలను పూయించారు. పరమ పవిత్రమైన పాత్రికేయరంగానికి మార్గదర్శిగా నిలిచారు. గత కొద్దిరోజులుగా అస్వస్థతతో ఉన్న ఆయన ఈనెల 8వ తేది వేకువన 4.50 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో ఓ మహాశిఖరం నేలకు ఒరిగిపోయినట్లయింది. తెలుగునేల ఓ అవిశ్రాంత అక్షరయోధుడిని శాశ్వతంగా కోల్పోయినట్లయింది.***

రామోజీరావు..అసలు పేరు రామయ్య. 1936 నవంబరు 16న చెరుకూరు వెంకటసుబ్బారావు-సుబ్బమ్మల గారాల బిడ్డగా రామయ్య జన్మించారు. పుట్టిందీ పెరిగిందీ..చిన్నతనమంతా జరిగిందీ అంతా కృష్ణాజిల్లా గుడివాడకు సమీపంలోని పెదపారుపూడి గ్రామంలోనే. బడిలో అయ్యవారు నీ పేరేంటీ అని అడిగితే, గంభీరంగా రామోజీరావు అని చెప్పాడు. అప్పటినుంచే రామయ్య పేరు రామోజీరావుగా మారింది. తన పేరు తానే మార్చుకున్నట్లుగానే, ఆ తర్వాతి కాలంలో తన జీవన విధానాన్ని కూడా మార్చుకున్నాడు. గుడివాడలో కాలేజీ చదువులు చదువుకునేటప్పుడే కమ్యూనిజంపై ఆసక్తితో చండ్ర రాజేశ్వరరావు, పుచ్చలపల్లి సుందరయ్యల వంటి కమ్యూనిస్టు నేతలపై ఇష్టంతో తానూ కమ్యూనిస్టయ్యాడు. కమ్యూనిస్టు పార్టీలో సభ్యునిగా కూడా పనిచేశాడు. ఆ తర్వాత గాంధీజీ అహింసా సిద్ధాంతం ప్రభావంతో తన జీవిత గమనాన్ని తీర్చిదిద్దుకున్నాడు. వ్యాపారరంగంలో అడుగుపెట్టి నిరంతర కృషితో విజయాలెన్నో సాధించుకున్నారాయన. నమ్మకమే పెట్టుబడిగా, విశ్వసనీయతే ఊపిరిగా 1962లో ఆయన ఏర్పాటుచేసిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ అచిరకాలంలోనే లక్షలాది ప్రజలకు చేరువైంది. దేశంలోనే అగ్రశ్రేణి చిట్‌ఫండ్స్ సంస్థగా 'మార్గదర్శి' పేరు తెచ్చుకుంది. దాదాపు 60 ఏళ్ళ ప్రస్థానంలో సుమారు 60 లక్షల మంది ఖాతాదారుల దాకా ఆ సంస్థలో ఉన్నారంటే మార్గదర్శి ప్రజల హృదయాల్లో ఎంతటి సుస్థిర స్థానం సంపాదించుకుందో ఊహించుకోవచ్చు.

### 'అన్నదాత'తో పత్రికారంగంలోకి :

మార్గదర్శితో వ్యాపారం మూడుపువ్వులారు కాయలుగా జరుగుతున్నా, రైతుబిడ్డ అయిన రామోజీరావు మరో ముందడుగు వేస్తూ రైతన్నలకు దిక్సూచీగా, ప్రత్యేకంగా రైతుల కోసం 1969లో 'అన్నదాత' పత్రికను పెట్టి పత్రికారంగంలో పెద్ద సంచలనం సృష్టించారు. సాహసాలకు మారుపేరైన రామోజీరావు ఆ పత్రికకు కూడా రాష్ట్రవ్యాప్త ఖ్యాతిని తెచ్చి అన్నదాతలకు కరదీపికగా నిలిపారు. అదే స్ఫూర్తితో 1974 ఆగస్టు 10న విశాఖపట్నం వేదికగా మరింత సంచలనం కలిగిస్తూ 'ఈనాడు' దినపత్రికను ప్రారంభించారు. ప్రజల పక్షాన నిలిచి అక్షరాలను పాశుపతాస్త్రాలుగా మలచి, జనం కోసం అక్షర దివిటీలను వెలిగించారు. పరిశోధనాత్మక వార్తలు, ప్రత్యేక వ్యాసాలు, విశేషమైన ఆకట్టుకునే కథనాలతో ఆ పత్రిక ప్రజలకు ఆత్మబంధువుగా మారింది. ప్రజల సమస్యలను వెలుగులోకి తెచ్చి వాటి పరిష్కారానికి అహరహం రామోజీరావు తపించడమే కాక.. ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజల రక్షణ పరమావధిగా సాగిన 'ఈనాడు' అక్షరజైత్రయాత్ర అచిరకాలంలోనే దిగ్విజయమై ఆ పత్రిక కూడా తెల్లవారేసరికల్లా ఇళ్ళ ముంగిళ్ల వద్ద వాలుతూ వెలుగు దీపికగా మారింది. దాంత పాటు తెలుగుభాషకు, తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ, నవలా రంగంలో 'చతుర', కథా కథనంలో 'విపుల', అత్యుత్తమ రచనలతో 'తెలుగు వెలుగు' పత్రికలు రామోజీరావు హృదయసంస్కారానికి, ఆయన పాటించిన నైతిక విలువలకు అద్దం పడుతూ, ప్రజాహృదయాల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నాయి.

## పట్టిందల్లా బంగారమే!



ఒక్క మాటలో చెప్పాలంటే రామోజీరావు అదృష్టజాతకులు. ఆయన పట్టిందల్లా బంగారమే అయ్యింది. రామోజీ గ్రూప్‌సంస్థలు వటవృక్షాల్లా ఎదిగాయి. మార్గదర్శితో పాటు సంప్రదాయ వంటకాలతో తయారైన 'ప్రియా ఫుడ్స్', పచ్చళ్ళనుంచి వందలాది రకాల ఆహార ఉత్పత్తులతో రాష్ట్ర, జాతీయస్థాయిల్లో కూడా ప్రఖ్యాతిని తెచ్చుకున్నాయి. ఆయన చేతిచలువతో లక్షలాది మంది ఉద్యోగులు, సిబ్బందికి జీవనభృతి లభించింది. ఆతిథ్యరంగంలో డాల్ఫిన్ హోటల్స్ మరో ఘనతను సృష్టించుకుంటే, అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాదులో నిర్మించిన 'రామోజీ ఫిల్మ్‌సిటీ' సినీరంగానికో వరంగా, సినిమాల చిత్రీకరణకు అదో అద్భుతమైన వేదికగా మారింది. స్వయంగా ఆయన నిర్మాణంలో ఎన్నో చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. ఉషా కిరణ్ మూవీస్ ద్వారా నిర్మించిన 'మయూరి', 'ప్రతిఘటన' వంటి ఎన్నో సందేశాత్మక చిత్రాలు అఖండ విజయం సాధించి ఆయనకు మరింత పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి.



## 'పద్మభూషణుడు'గా..

## విశిష్ట ఖ్యాతి

క్రమశిక్షణకు, నిబద్ధతకు మారుపేరుగా, మూర్తీభవించిన మానవతా శిఖరంగా పేరొందిన రామోజీరావు తన జీవితప్రస్థానంలో ఎన్నో మైలురాళ్లను అధిగమించారు. అనేక రంగాల్లో ఎవరూ సాధించలేనన్ని విజయాలను సాధించారు. 1995లో ఈటీవీ స్థాపనతో 'బుల్లితెర'ను తెచ్చి ప్రజల హృదయాలకు మరింత దగ్గరయ్యారు. దానిని జాతీయ స్థాయి నెట్‌వర్క్‌గా విస్తరించడంతో రామోజీ ఖ్యాతి దేశవ్యాప్తమైంది. సమాచార రంగంలో ఎన్నో సంచలనాలను సృష్టించారు. అంతేకాదు, భారతీయ సినీగాయకుడు, గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సారథ్యంలో ఈటీవీలో ప్రసారమైన 'పాడుతా తీయగా' వంటి కార్యక్రమాలు ప్రపంచ వ్యాప్త ఖ్యాతితో రామోజీరావుకు ఎనలేని పేరును తెచ్చిపెట్టాయి. లక్షలాదిమంది గాయనీగాయకులు, వర్ధమాన గాన కళాకారులకు, కొత్త గొంతుకలకు జీవం పోసిన ఆ కార్యక్రమం అంతర్జాతీయ స్థాయిలో ప్రజల మన్ననలు పొందడం విశేషం. వాటన్నిటికీ రామోజీరావు అమోఘమైన శ్రద్ధాసక్తులే కారణం.

అంతటి నిబద్ధత, క్రమశిక్షణ, అకుంఠిత కర్తవ్యదీక్షతోనే దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'పద్మభూషణ్' బిరుదు రామోజీరావును వరించింది. తెలుగు భాషకు, తెలుగు జాతికి ఆయన చేసిన ఉత్తమ సేవలకు గుర్తింపుగా 2016లో నాటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా ఆయన ఆ విశిష్టమైన అవార్డును అందుకున్నారు.

ఏదేమైనా, జీవితాన్నే అక్షరతూణీరం చేసిన పాత్రికేయ రుషి.. రామోజీరావు ఇక లేకపోవడం బాధాకరం. పత్రికారంగంలో ఆయన ప్రస్థానం భావితరాలకు మార్గదర్శకం!.. ఆ నిరంతర అక్షర కృషీవలుని మరణానికి చింతిస్తూ, అక్షరనివాళులర్పిస్తోంది...'లాయర్'!...

## ఋణం తీర్చుకున్న బాబు



తెలుగుదేశం పార్టీ పుట్టిన నాటినుంచి ఆ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన రామోజీరావు, వైకాపా ప్రభుత్వం వచ్చాక అనేక రకాలుగా అవమానాలకు గురయ్యారు. ఒకదశలో ఆయన ప్రతిష్టాత్మకంగా స్థాపించిన మార్గదర్శిపై దాడులు చేసి, కేసులు పెట్టి, రామోజీరావును ఇంటరాగేషన్ దాకా తీసుకువచ్చి తీరని ఆవేదనకు గురిచేశారు. ఆయన అనారోగ్యంతో ఉన్నా కనికరం లేకుండా, లేనిపోని ఆరోపణలతో మానసికంగా బాధించారు. 'ఈనాడు'పై కక్షగట్టి, 'పచ్చరాతలు', 'పచ్చమీడియా' అంటూ ఎద్దేవా చేస్తూ అసంబద్ధమైన విమర్శలతో వేధించారు. అనేక శాఖల అధికారులను మూకుమ్మడిగా రామోజీ నివాసంపైకి పంపి విచారణల పేరుతో ఎన్నో ఇబ్బందులకు గురిచేశారు. అయినా, ఆయన చెక్కుచెదరలేదు. గుండెదిటవుతో అన్ని కష్టాలకు ఓర్చుకున్నారు. ప్రభుత్వంపై కూడా పోరాడారు. చివరికి సార్వత్రిక ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వ ఘోరపరాజయాన్ని కళ్లారా చూశారు. తెలుగుదేశం పార్టీకే కాక, తెలుగు ప్రజలకు, తెలుగుభాషకు తోడునీడగా ఉంటూ ప్రజల ఆదరాభిమానాలు పొందిన రామోజీరావు మరణంతో, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆవేదనకు గురయ్యారు. ఆయన భౌతికకాయాన్ని కన్నీటితో సందర్శించి, రామోజీరావు పాడెను మోసి.. కన్న కొడుకులా ఋణం తీర్చుకున్నాడు.



## చంద్రబాబుతో సోమిరెడ్డి భేటీ

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుతో ఈనెల 11న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భేటీ అయ్యారు. చంద్రబాబునాయుడుకు ఆయన శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా సర్వేపల్లి నియోజకవర్గం నుంచి మూడవసారి శాసనసభ్యునిగా ఎన్నికైన సోమిరెడ్డిని చంద్రబాబు అభినందించారు.

### తొలిసారి శాసనసభలో అడుగిడనున్న..

## వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



నెల్లూరుజిల్లా కోవూరు శాసనసభా నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసి అఖండ విజయం సాధించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఈనెల 11న విజయవాడలో జరిగిన శాసనసభా పక్ష సమావేశానికి హాజరయ్యారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరిల ఆధ్వర్యంలో, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు అందరూ నారా చంద్రబాబునాయుడును శాసనసభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో, త్వరలోనే ప్రశాంతిరెడ్డి కోవూరు నుంచి మహిళా ఎమ్మెల్యేగా తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టబోతున్నారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

## ప్రజలకు రుణపడి ఉంటా

**ఎమ్మెల్యే పాశం సునీల్**



గూడూరు నియోజకవర్గంలో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలందరికీ రుణపడి ఉంటానని, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యేగా ఎన్నికైన పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఇటీవల ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తన గెలుపుకు కృషి చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. వాకాడులో దేవాలయం భూముల ఆక్రమణలు బయటకు తీస్తానని, సిలికా అక్రమ రవాణా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. గూడూరులో అంబేద్కర్ భవనం కట్టిస్తామని, ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేసేలా కృషి చేస్తామని, తాగునీటి సమస్యలేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాతీర్పును స్వాగతిస్తాం - ఎమ్మెల్సీ మేరిగ



2024 సార్వత్రిక ఎన్నికలలో ప్రజాతీర్పును స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ అన్నారు. ఇటీవల సనత్‌నగర్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు బాధను కలిగించినా ప్రజా తీర్పును స్వాగతిస్తామన్నారు. రాజకీయాలలో ఉంటూ ప్రజలు, పార్టీ కార్యకర్తలు, వైసీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. ఇకపై కూడా నియోజకవర్గంలోనే ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వైసీపీ కార్యకర్తల జోలికొస్తే మౌనంగా ఉండబోమన్నారు. న్యాయమైన పోరోటాలు సాగిస్తామన్నారు. అవసరమైతే కోర్టులను కూడా ఆశ్రయిస్తామన్నారు. ప్రతిపక్షంలో తనకు కొత్తేమీ కాదని, రాష్ట్రమంతా ప్రజలు మార్పును కోరుకున్నారన్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి గురుమూర్తి గెలుపు సంతృప్తినిచ్చిందన్నారు. వైసీపీ పట్టణాధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎండీ మగ్ధూమ్ మొహిద్దీన్, రుద్రరాజు, జలీల్, మురళీ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## బీజేపీ నేతల సంబరాలు

దేశ ప్రధానిగా నరేంద్రమోడీ ప్రమాణస్వీకారం చేయడంతో బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. గూడూరు పట్టణం గడియారపు స్థంభం కూడలి వద్ద ఆదివారం టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. పట్టణ అధ్యక్షుడు ఆరికట్ల బాలకృష్ణంనాయుడు మాట్లాడుతూ దేశాభివృద్ధి నరేంద్రమోడీతోనే సాధ్యమని ప్రజలు మూడోసారి ఎన్డీఏ కూటమికి అధికారం అందించారని తెలిపారు. దయాకర్, పురుషోత్తమరెడ్డి, గిరిధర్‌రెడ్డి, మనోజ్, సురేష్ పాల్గొన్నారు. కాగా, అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సయ్యద్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచిపెట్టారు.

## నృత్య విద్యార్థుల ప్రతిభ



ఒరిస్సా రాష్ట్రంలోని పూరీ నగరంలో జరిగిన శ్రీ జగన్నాథ నృత్యోత్సవంలో గూడూరు శ్రీ శివ లలిత భరతనాట్య కళాక్షేత్రం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. భారత్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల నుంచి నృత్య కళాకారులు హాజరయ్యారు. ఆదివారం పూరీ నగరంలోని అన్నపూర్ణ రంగమాచా ఆడిటోరియంలో జరిగిన నృత్య పోటీలలో గూడూరు శ్రీ శివ లలిత భరత నాట్య కళాక్షేత్రం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అందుకుగాను భారత్ ఆర్ట్స్ అకాడమి వ్యవస్థాపక అధ్యక్షులు లలితారావు చేతుల మీదుగా కళాక్షేత్రం వ్యవస్థాపకులు పిండి మల్లిక-వెంకయ్యలను ఘనంగా సత్కరించారు.






### డాక్టర్ సీతారామయ్య

## సంస్మరణ సభ



గూడూరు రోటరీ భవనంలో ఈ నెల 9న డాక్టర్ కె.సీతారామయ్య సంస్మరణ సభ జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రోటరీ అధ్యక్షులు రామకృష్ణ స్వరూప్ అధ్యక్షతన రొటేరియన్లు కె.జానకిరామిరెడ్డి, దశరథరామిరెడ్డి, డాక్టర్ జనార్ధనరెడ్డి, కె.మునిగిరీష్, మయూరి శ్యాం యాదవ్, జీజీ నాయుడు తదితరులు మాట్లాడుతూ సీతారామయ్య గూడూరులో దాదాపు 35 సంవత్సరాలు మున్సిపల్ డాక్టర్‌గా పనిచేసి ప్రజల మన్నలను పొందారని, రోటరీ క్లబ్‌లో 50 ఏళ్ళపైగా సభ్యులుగా ఉన్నారని, సీతారామయ్య సంతానం మధు, డాక్టర్ రాం, రవి, లలితమ్మలు కూడా ఆయన బాటలో నడుస్తూ పేదవారికి సహాయసహకారాలు అందిస్తున్నారని ప్రశంసించారు. వారి తల్లి శ్రీలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె పేరు మీద చెన్నైలో పేదవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నారని తెలిపారు.






# 'నీట్'లో రైతుబిడ్డ.. మనస్విత ప్రతిభ

ఇటీవల వెల్లడైన 'నీట్' ఫలితాల్లో ఆత్మకూరుకు చెందిన రైతుబిడ్డ ఏ.మనస్విత ఎంతో కష్టపడి చదువుకుని అత్యుత్తమ మార్కులు సాధించి అఖిలభారత స్థాయిలో 1689వ ర్యాంకును కైవసం చేసుకుంది. అనంతసాగరం మండలం అగ్రహారం గ్రామానికి చెందిన మనస్విత, తల్లితండ్రులు భాస్కర్‌రెడ్డి -ఉషల ప్రోత్సాహంతో శ్రీచైతన్య కళాశాలలో కోచింగ్ తీసుకుని నీట్‌లో 720 మార్కులకు గాను 700 మార్కులు సాధించి అందరి అభినందనలు అందుకుంది. తండ్రి సామాన్య రైతే అయినా, మనస్విత చదువుపట్ల చూపుతున్న ఆసక్తిని గమనించి చిన్నతనం నుంచే బాగా చదివించాడు. ఇటీవల కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు. తల్లితండ్రులు కన్న కలలను నెరవేరుస్తానని, గురువుల ప్రోత్సాహంతో ఎంబీబీఎస్ పూర్తిచేసి గ్రామీణ ప్రాంతాల పేదలకు వైద్యసేవలు అందించాలన్నదే తన ఆశయమని మనస్విత చెప్తోంది.

## ఆర్యవైశ్య విద్యార్థులకు
# ఉచిత హాస్టల్ సౌకర్యం

**- పాండురంగ అన్నదాన సమాజం నిర్వాహకులు**

పేద ఆర్యవైశ్య విద్యార్థుల కోసం నెల్లూరులోని శ్రీ పాండు రంగ అన్నదాన సమాజం వారు ప్రతి ఏటా ఉచిత హాస్టల్, ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది 2024-25 సంవత్సరానికి 6వ తరగతి నుండి, డిగ్రీ వరకు చదువుకునే విద్యార్థుల కోసం ఈనెల 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, 21వ తేదీ వరకు దరఖాస్తులు స్వీక రించి, 25న తుది జాబితా ప్రకటిస్తామని పాండురంగ అన్నదాన సమాజం కార్యదర్శి చలువాది వెంకటేశ్వర్లు (వైభవ్ శ్రీనివాస్), హాస్టల్ కమిటీ ఛైర్మెన్ వాయుగుండ్ల హజరత్తయ ఈనెల ఇటీవల ఒక ప్రకటనలో కోరారు. వివరాలకు నెల్లూరు పప్పులవీధిలోని శ్రీ పాండురంగ అన్నదాన సమాజంలో సంప్ర దించాలని వారు కోరారు.

# బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు




ప్రముఖ సినీ హీరో, యువరత్న నందమూరి బాలకృష్ణ 64వ పుట్టినరోజు వేడుకలు ఈనెల 10న నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. స్థానిక ఏసీ స్టేడియంలో జరిగిన ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని 15కేజీల కేకును కట్‌చేసి అందరికీ పంచారు. సమాజసేవాభావంతో వాకర్స్ అసోసియేషన్ వారు, దాతలు కలిసి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుండటాన్ని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మజ్జిగ చలివేంద్రం, మంచినీటి చలివేంద్రంలను ప్రారంభించారు. నందమూరి బాలకృష్ణ సినీనటనలో తనదైన ప్రత్యేకతను సాధించుకుంటూ మెగా సినిమాలతో ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని, త్వరలోనే ఆయన నటించిన 109వ సినిమా కూడా విడుదల కానుందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్ సంఘం నాయకుడు నలుబోలు బలరామయ్యనాయుడు ప్రస్తుతించారు. అసోసియేషన్ అధ్యక్షులు బిరదవోలు రామ మోహన్‌రెడ్డి, కార్యదర్శి షేక్ నజీర్ అహమ్మద్, కోశాధికారి శానంపూడి సుబ్బరాయుడు, మాగంటి ప్రసాద్‌నాయుడు, బెల్లం చెంచయ్యనాయుడు, రత్నం నాయుడు, జయరామనాయుడు, మధుసూదన్‌నాయుడు, తిరుపతినాయుడు, మురళి, కిలారి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయన దార్శనికత అమోఘం

## రామోజీరావు మృతికి శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి సంతాపం

'ఈనాడు' గ్రూప్ సంస్థల అధిపతి రామోజీరావు దార్శనికత అమోఘమని, ఆయన మరణం బాధాకరమని శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఒక ప్రకటనలో తన సంతాపం తెలిపారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు, వారి సంస్థల ఉద్యోగులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామోజీరావు అసాధారణమైన వ్యక్తి అని, ఆయన విజ్ఞతతో వివిధ వ్యాపార రంగాలను, ముఖ్యంగా మీడియా రంగాన్ని ప్రభావితం చేశారని పేర్కొన్నారు. పాత్రికేయ విభాగంలో ఆయన అంకితభావం, అనుభవం, సాధించిన అనితరసాధ్యమైన విజయాలు ఎంతో మంది యువ జర్నలిస్టులకి స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు. ఒక అద్భుతమైన వ్యాపారనగరంగా శ్రీసిటీ అభివృద్ధిని వివరిస్తూ పలుసార్లు 'ఈనాడు' పత్రిక, ఈటీవీ కథనాల ద్వారా శ్రీసిటీకి అందించిన సహకారం మరువలేమని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

## పల్లిపాడు 'డైట్'లో..
# డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహావిష్కరణ



ఇందుకూరుపేట మండలం, పల్లిపాడులోని ప్రభుత్వ డైట్ ప్రాంగణంలో 1984-85 విద్యా సంవత్సరంలో టీటీసీ చదివిన పూర్వ విద్యార్థులు ఇటీవల డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. డైట్ విద్యాసంస్థలో 40 ఏళ్ల క్రితం టీటీసీ కోర్సును చదువుకుని ప్రస్తుతం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న దాదాపు 150 మందికి పైగా విద్యార్థులు డైట్ సంస్థ ఆవరణలో స్వతంత్ర భారతదేశపు తొలి ఉపరాష్ట్రపతి, ఉపాధ్యాయ లోకానికి ఆరాధ్యులైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని తమ సొంత నిధులతో ఏర్పాటుచేసి ఆవిష్కరించడం అభినందనీయమని సంస్థ ప్రిన్సిపాల్ డా. పి.రమేష్ అన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆ సంస్థ ప్రధానాచార్యులను, సీనియర్ ఉపన్యాసకులను, అధ్యాపకులను కృతజ్ఞతాపూర్వకంగా ఘనంగా సన్మానించారు. డైట్ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఆర్. బాలాజీరావు, ఉప న్యాసకులు యన్.శివ, కె.విజయచంద్ర, కార్యాలయ సూపరింటెండెంట్ యస్.సురేష్, కార్యాలయ సిబ్బంది, పూర్వ విద్యార్థులు అచ్యుత మణి, ఎస్‌కె రఫీ, విజయ్‌కుమార్, మల్లి, గిరిధర్‌సింగ్, రాధిక, విజయమ్మ, బాబురెడ్డి, పి.వి రమణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



# బాలూ పాటలను ఏనాటికీ మరువలేం

## ప్రముఖ సినీ సంగీత దర్శకుడు విద్యాసాగర్

గానగంధర్వుడు, ప్రఖ్యాత సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలను ఏనాటికీ మరచిపోలేమని, ఆయన గానం అజరామరమని, తన మధురాతిమధురమైన పాటలతో బాలూ ప్రజల గుండెల్లో శాశ్వతస్థానం సంపాదించుకున్నారని ప్రముఖ సినీసంగీత దర్శకుడు విద్యాసాగర్ కొనియాడారు. బాలూ జయంతిని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు పురమందిరంలో చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాలూ స్మారకార్డం తనకు 'సంగీత విద్వన్మణి' అనే బిరుదునిచ్చి ఘనంగా సత్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలుగుభాష, సాహిత్యం జీవించివున్నంతవరకు బాలు ప్రజల హృదయాల్లో జీవించే ఉంటారన్నారు. తొలుత, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు, ఈనెల 8న మరణించిన 'ఈనాడు' పత్రిక అధినేత రామోజీ రావుకు నివాళులర్పించారు. ప్రముఖ సినీ కవి భువనచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, సినీనటుడు శుభలేఖ సుధాకర్ తదితరులు పాల్గొని బాలూ పాటల్లోని మాధుర్యాన్ని వివరించారు. చేతన కార్యదర్శి వై. శేషగిరీశం, పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, వీరిశెట్టి హజరత్‌బాబు, నలుబోలు బలరామయ్యనాయుడు, మావూరి శ్రీనివాసరావు, డా.పి.రాజేంద్రకుమార్, వై. వెంకట రామయ్య తదితరులు పాల్గొన్నారు. విఆర్‌సీ విశ్రాంత ప్రిన్సిపాల్ డా.ఎం.సుబ్రహ్మణ్యం వ్యాఖ్యాతగా వ్యవహరించారు. బాలూ గానం చేసిన అన్నమయ్య సినిమాలోని గీతాలకు దివ్యపావని శిష్యబృందం చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ అలరించాయి.

# టూకీగా...



## పెంచలకోనలో..
## కల్యాణోత్సవానికి భక్తుల కిటకిట!

రాపూరు మండలంలోని పెంచలకోనలో చెంచులక్ష్మి-ఆది లక్ష్మి సమేత శ్రీ నృసింహస్వామి వారి కల్యాణోత్సవం ఇటీవల కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలతో పాటు పల్లకిసేవ, రాత్రి సహస్రదీపాలంకరణ సేవలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

## సంగం వద్ద రోడ్డుప్రమాదం..గేదె మృతి

ఈనెల 10న సంగం కొండ మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సిమెంట్ ట్యాంకర్ అదుపుతప్పి కారును ఢీకొని రోడ్డుపై వస్తున్న గేదెలను ఢీకొనడంతో ఒక గేదె మృతిచెందగా మరో గేదెకు బలమైన దెబ్బలు తగిలాయి. కారులో ఉన్నవారికి ప్రమాదం తప్పింది. ట్యాంకర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సైదాపురంలో అక్రమ లారీల సీజ్

సైదాపురంలో అక్రమంగా తెల్లరాయి తరలిస్తున్న రెండు లారీలను ఈనెల 10న మైనింగ్‌శాఖ విజిలెన్స్ అధికారి నాయక్ పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అనుమతుల్లేకుండా ఖనిజసంపదను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## చుంచులూరు వద్ద బస్సు ఢీ.. 5 ఆవులు మృత్యువాత

మర్రిపాడు మండలం చుంచులూరు వద్ద ఈనెల 10న జరిగిన రోడ్డుప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఆవుల మందను ఢీకొన డంతో 5 ఆవులు మృత్యువాత పడ్డాయి. జమ్మలమడుగు డిపోకి చెందిన బస్సు నెల్లూరుకు వెళ్తుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం జరిగింది. మృతిచెందిన ఆవులను చూసిన యజమానులు గోడుగోడుమంటున్నారు.

## యల్లాయపాళెంలో గర్భిణులకు వైద్యపరీక్షలు

కొడవలూరు మండలంలోని యల్లాయపాళెం వైద్యశాలలో ఈనెల 10న వైద్యాధికారిణి సింధుమేఘన ఆధ్వర్యంలో గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 'ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్' కింద చేపట్టిన ఈ కార్యక్రమంలో బాలింత లకు వైద్యపరీక్షలు చేసి, కాన్పు అనంతరం బిడ్డ సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల అవగాహన కలిగించారు.

## పొంగూరులో 104 వైద్యసేవలు

మర్రిపాడు మండలంలోని పొంగూరులో ఇటీవల 104 వాహనం ద్వారా ప్రజలకు వైద్యసేవలందించారు. ఆరోగ్య పరిరక్షణ పట్ల గ్రామస్తులకు అవగాహన కలిగించారు. మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ అంకిరెడ్డి, ఏఎన్ఎంతో పాటు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## రామస్వామిపల్లిలో కనకదుర్గమ్మతల్లికి పూజలు

ఆత్మకూరు రూరల్ మండలం రామస్వామిపల్లిలో కనకదుర్గమ్మ అమ్మవారి ఉత్సవాల సందర్భంగా, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, చెంతనే ఉన్న పెన్నానది వద్ద అమ్మవారి ఉత్సవమూర్తికి పెన్నా జలాలతో అభిషేకోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కేసీ నారాయణ, ఎంఎస్‌రెడ్డి, పి.వెంగయ్య, డాక్టర్ కృష్ణారెడ్డి, వెంకటరమణయ్య పర్యవేక్షించారు.

## రాపూరులో క్షయవ్యాధిపై అవగాహన

రాపూరు విద్యావనరుల కేంద్రంలో ఈనెల 10వ తేదీన డాక్టర్ సుదర్శనమ్మ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నివారణ పట్ల ప్రజలకు అవగాహన కలిగించారు. షుగర్, బీపీ, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి ప్రతి గురువారం బీసీజీ వ్యాక్సిన్ వేసేవిధంగా ఏర్పాట్లుచేశామని ఆమె తెలిపారు.

## జమ్మలపాళెం వద్ద మామిడికాయల లారీ బోల్తా

మామిడికాయల లోడ్‌తో తిమ్మసముద్రం నుంచి హైదరా బాద్‌కు వెళ్తున్న ఓ లారీ ఈనెల 9న అదుపు తప్పి జలదంకి మండలం జమ్మలపాళెం వద్ద బోల్తాకొట్టింది. అయితే లారీలో ఉన్న డ్రైవర్‌కు కానీ, అందులో ఉన్న మరో ముగ్గురికి కానీ ఎలాంటి గాయాలు తగలకుండా బయటపడ్డారు.



# కామాక్షమ్మ సేవలో.. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం..కోవూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో కొలువై ఉన్న శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారిని ఇటీవల కోవూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఘన విజయం సాధించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కోవూరు శాసనసభ్యురాలిగా అఖండ విజయం సాధించిన తర్వాత ప్రశాంతిరెడ్డి తొలిసారిగా జొన్నవాడకు వచ్చి, కామాక్షి అమ్మవారి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన అశ్వవాహన సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ సంప్రదాయం ప్రకారం ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేయించి, అమ్మవారి పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సుభిక్షంగా వుండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆమె తెలిపారు. ఆలయ అధికారులు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు 'వాకర్స్' పౌష్టికాహారం



నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వేసవిక్రీడా శిక్షణా శిబిరాల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు స్థానిక వివేకానంద వాకర్స్ అసోసియేషన్ వారు ఇటీవల పౌష్టికాహారాన్ని పంపిణీచేశారు. డాక్టర్ చెరుకూరు దొరస్వామినాయుడు సహకారంతో పౌష్టికాహారాన్ని మాజీ మేయర్ భానుశ్రీ చేతులమీదుగా క్రీడాకారులకు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు, కార్యదర్శి రమేష్ బాబు, కోశాధికారి జయదేవ్, వాకర్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్ర, డాక్టర్ అంకిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, వెంకటరావు, లోకేష్, నారాయణరావు, గోపాల్‌రెడ్డి, పొన్నం రవిచంద్ర, సుబ్బరామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 4 సెకన్లు గుండెను ఆపేసి.. ఆపరేషన్

## ○ నెల్లూరు అపోలో ఆసుపత్రి మరో ఘనత



క్లిష్టతరమైన ఆపరేషన్లను సైతం విజయవంతంగా నిర్వహించడంలో నెల్లూరులోని అపోలో ఆసుపత్రి తన ప్రత్యేకతను చాటుకుంటోంది. తాజాగా ఓ రోగికి ఆపరేషన్ అవసరమైతే, లబ్ డబ్ అంటూ కొట్టుకుంటున్న గుండెను నాలుగు సెకన్లపాటు ఆపేసి మరీ ఆపరేషన్‌ను దిగ్విజయంగా చేశారు. ఈనెల 11న ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, ప్రముఖ కార్డియాలాజిస్ట్ డాక్టర్ చిర్రా భక్తవత్సలరెడ్డిలు ఆ విషయాలను వెల్లడించారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండకు చెందిన నాగేశ్వరరావు(70) గత కొంత కాలంగా ఆయాసం, దగ్గు, చాతి నొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రులలో చికిత్స చేయించుకున్నా ఫలితం కనిపించలేదు. దీంతో ఆయన నెల్లూరు అపోలోకు వచ్చారు. వైద్యులు పరీక్షలు చేయగా ఆక్సిజన్ పల్స్ శాతం 80, హార్ట్ రేట్ 130, కిడ్నీ ఫంక్షన్ 2.3గా గుర్తించడం జరిగింది. పూర్తిస్థాయిలో పరీక్షించగా అతని గుండెలో ఉండే కవాటం మూసుకొని ఉంది. అది ఐదు సెంటీమీటర్లు ఉండాల్సి ఉండగా కేవలం 0.7 సెంటీమీటర్లు మాత్రమే ఉంది. దీనివల్ల గుండె బాగా బలహీన పడింది. ఈ పరిస్థితుల్లో రోగిని కాపాడడానికి ఆపరేషన్ అవసరమైంది. కాలు ద్వారా వాలు అమర్చి ఆపరేషన్ చేశారు. పేషంట్ గుండెను పేస్ మేకర్ ద్వారా నాలుగు సెకండ్లు ఆపి, కాలు నుంచి వాలును పొజిషన్‌లోకి తీసుకొని ఆపరేషన్ విజయవంతం చేశామని, ఇదెంతో అరుదైన శస్త్రచికిత్స అని వైద్యులు వివరించారు. రోగి కోలుకుని ఆరోగ్యంగా ఉన్నాడని వారు తెలిపారు. ఈ సమావేశంలో ఆసుపత్రి ఐసీయూ హెడ్ డాక్టర్ శ్రీనివాస్, కార్డియో థొరాసిక్ సర్జన్లు డాక్టర్ విజ్ఞ చరణ్, డాక్టర్ మధు, కార్డియాలాజిస్టులు డాక్టర్ షర్మిలి, డాక్టర్ నాగభూషణం, యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



## జానకిరామ.. రామాయణం (17)

- ఊటుకూరు జానకి రామారావు

అయోధ్యా నగర ప్రజలందరికీ పెద్దపండుగ. తమ ఇంట్లో తమ కుమారుడికే పెళ్ళి అయ్యిందన్న ఆనందంలో మునిగితేలారు వారు. అవును! రాముడు ప్రతి ఇంటికీ పెద్దకుమారుడే! ప్రతి ఇల్లాలు ఆయనను తన కొడుకుగానే చూసుకొని మురిసిపోతున్నది.

అయోధ్యా నగరపు ప్రతి ఆడబిడ్డ ఆయనను తమ తోడబుట్టినవాడుగానే భావిస్తుంది. ప్రతిపౌరుడు తమ యువరాజుని తమ స్నేహితునిగానే భావిస్తున్నాడు.

ఆ పురంలోని పశుపక్ష్యాదులకు కూడా రాముడంటే ప్రేమ!

ఇంతెందుకు అయోధ్యలోని జీవరాశుల ప్రాణాలన్నిటినీ ఒకచోట కుప్పగా పోస్తే అది దాల్చే రూపం “రామయ్య”.

(ఒక మనిషి ఇంతమంది అభిమానాన్ని చూరగొనాలంటే ఆతని ప్రవర్తన, నడవడిక, మాట, ఆయన మనస్సు ఎంత ఉన్నతమైనవిగా ఉండాలి!. మహర్షి వాల్మీకి మాటల్లోనే రాముని గుణగణాలు).

రాముడు సర్వలోక మనోహరుడు, అసూయ లేనివాడు, ఎల్లప్పుడూ ప్రశాంత చిత్తుడు (తొణకడు బెణకడు).

ఎవరైనా పరుషంగా తనతో మాట్లాడితే దానికి ప్రత్యుత్తరం చెప్పడు (non reactive behaviour).

ఎవరైనా చిన్న ఉపకారం చేసినా సంతోషపడిపోయి... అది ఆజన్మాంతం గుర్తుంచుకుంటాడు. ఎవరైనా అపకారం తలపెడితే దానిని స్మరించడు!

శీలవృద్ధులు, జ్ఞానవృద్ధులు, వయోవృద్ధులు, సత్పురుషుల వద్దకు తానుగా వెళ్ళి మాట్లాడుతుంటాడు.

(ఈనాటి సమాజం వృద్ధుల అవసరమే లేనట్లుగా ప్రవర్తిస్తోంది. వృద్ధులకోసం ఆశ్రమాలు కట్టించి వారిని సమాజస్రవంతి నుండి దూరం చేస్తున్నాం... మనకు తెలివితేటలు జ్ఞానం అధికంగా కలగాలంటే వృద్ధులను సేవించడమొక్కటే మార్గం! ఆర్య చాణుక్యుడు ఇలా చెపుతారు, జ్ఞానమ్ వృద్ధోపి సేవనమ్! అని).

ఆయన పరాక్రమవంతుడు, ముల్లోకాలలో ఆయనను ఎదురొడ్డి నిలువగలవాడు లేడు! పైగా రాజపుత్రుడు! కాబోయే సమ్రాట్టు! అయినా!.. తనకు కనపడినవాడిని అతనికంటే తానేముందు మధురంగా, మృదుమధురంగా పలకరిస్తాడు, బుద్ధిమంతుడు!

***బుద్ధి మాన్ మధురాభాషీ పూర్వభాషీ ప్రియంవదః***
***వీర్యవాన్న చ వీర్యేణ మహతా స్వేన విస్మితః***

(ఎంత అద్భుతమైన పదప్రయోగమో! మధురభాషీ.. మధురంగా మాట్లాడతాడట... పూర్వభాషీ.. ముందుగానే మాట్లాడతాడట.. ప్రియంవదః ప్రియంగా పలుకుతాడట!)

అసత్యమాడి ఎరుగడు,పెద్దలను సగౌరవంగా ఎదురేగి పూజిస్తాడు, పనికిరాని, శ్రేయస్కరం కాని విషయాలను, కార్యాలను పట్టించుకోడు!

ఏ సమయంలో, ఏ దేశంలో ఏ పని చేయాలో చాలా చక్కగా తెలిసినవాడు. లోపలున్న భావాలను ఏమాత్రమూ బయటకు తెలియనిచ్చేవాడుకాదు! ఆలోచనలను రహస్యంగా ఉంచుకుంటాడు(మంచి Administratorకి అత్యంత అవసరమైన లక్షణం).

మొండిపట్టుదల లేనివాడు (highly flexible).

ఇతరులలోని దోషాలనే కాదు! తనలోని దోషాలను కూడా గుర్తించగలవాడు. (ఈ జ్ఞానం మనకెప్పటికైనా కలుగుతుందా అని ప్రశ్న వేసుకుంటే ! కలుగుతుంది అని సమాధానం వస్తుంది! కానీ ఎప్పుడు!?, ధర్మశాస్త్రాలు క్షుణ్ణంగా అధ్యయనం చేసి మనని మనం బయటివ్యక్తిగా భావించి మనలోకి మనం తొంగిచూసినప్పుడు! మన ప్రతి అడుగును శాస్త్రానికి అణుగుణంగా ఉన్నదో లేదో కొలుచుకోగలిగినప్పుడు! అప్పుడు!)

దశరథుడి మనస్సులో అంతర్మథనం జరుగుతోంది. తాను జీవించి ఉండగా సకలగుణాభిరాముడు రాముడు పట్టాభిషిక్తుడవటం కన్నులారా చూడగలడా!

తనకేమో వయసు మీదపడుతోంది.. ఊరుపొమ్మంటోంది కాడు రమ్మంటోంది! ఎన్నో వేల ఏండ్లు రాజ్యం చేశాడు తాను. ఇక ఈ రాజ్యాన్ని రాముని చేతిలో నిర్విఘ్నంగా పెట్టగలనో లేదో! ఉవ్వెత్తున అంతరంగ తరంగాలు లేచిపడుతున్నాయి! దశరథుడి హృదయంలో!

ఆరోజున అశ్వపతికి మాట ఇవ్వకపోయినా బాగుండేది!

అశ్వపతి కైక తండ్రి! పిల్లలు లేకపోవడం చేత కైకను పెళ్ళి చేసుకోవాలని తాను ఎందుకు సంకల్పించుకోవాలి?

సరే! అనుకున్నాను, మరి ఆమెను పెండ్లిచేసుకోవటానికి అశ్వపతికి మాట ఏల ఇవ్వవలే? కైకకు పుట్టినవాడికే రాజ్యాధికారం అప్పగిస్తానని!. ఇప్పుడు తాను ఆ మాట నిలబెట్టుకోగలడా?

రాముడిని పట్టాభిషిక్తుడిని చేస్తే అనృతదోషం అంటుకుంటుంది తనకు, చేయక పోతే?

వాడు!.... రాముడు! జ్యేష్ఠుడు, సర్వశ్రేష్ఠుడు, ప్రజాభీష్టుడు!

అట్లాంటివాడున్నప్పుడు వానికి తప్ప నిజానికి ఎవరికైనా పట్టాభిషేకం చేయడం సమంజసమా? అది న్యాయమా? జ్యేష్ఠుడిదేగదా రాజ్యాధికారం! ధర్మం తప్పి తాను వర్తించగలడా?

అటు చూస్తే అసత్యదోషం... ఇటు చూస్తే ధర్మగ్లాని! ఆయనకు ఏమీ పాలుపోవడంలేదు. చాలా దీర్ఘంగా ఆలోచించాడు! మనసు రాముని వైపే మొగ్గు చూపుతోంది!

ఇదే సరైన సమయం. భరతుడు కూడా నగరంలో లేడు!.

సింహాసనం అధిష్టించిన రాముని కనులార కాంచవలే!

అదే తన కోరిక!

ఒక నిశ్చయానికి వచ్చినవాడై మంత్రి, సామంత, పురోహితులనందరినీ పిలిచి సభ ఏర్పాటు చేసి ప్రకటించాడు!

రామునికి రేపు పట్టాభిషేక మహోత్సవమని!

అయితే జనకుడికి, అశ్వపతికి మాత్రం కబురంపలేదు! పట్టభిషేకమైన తరువాత తెలుపవచ్చని ఆయన ఆలోచన!

ఆ మాట వినీవినడంతోనే ప్రజలందరిలో ఆనందం మిన్నుముట్టింది! ఒక్కసారిగా సభలో పండుగ వాతావరణం నెలకొంది. ఆహా మా రాముడే వసుంధరావల్లభుడు!



ఎవరికివారే తామే రాజైనంత ఆనందంగా నర్తించారు!

వసిష్ఠులవారు వెంటనే సంభారములు సమకూర్చడానికి తగిన వారందరినీ నియమించారు.

దశరథుడు సుమంత్రుని పంపి రాముని రప్పించాడు!

రూపంలో, గుణంలో, వీరంలో సర్వశ్రేష్ఠుడైన తన జ్యేష్ఠ కుమారుడిని తనివితీరా అలాగే చూస్తూ ఉండిపోయాడా వృద్ధనరపతి!.

నా రాముడంటే మీకెందుకంత ఇష్టం? దశరథుడు తన మంత్రి, సామంత, పురోహితులను అడిగాడు... నిర్ణయం తీసుకునేముందు!

రాముడు కనపడగానే... వారి మాటలు మరొక్కసారి ఆయన మనసులో ప్రత్యక్షమై మనసును ఆనందంతో నింపివేసినవి.

నా రాముడు సర్వలోక మనోహరుడు!

రాముని గురించి సభలో వ్యక్తమయిన అభిప్రాయాలు ఇవి !.

ప్రజాసుఖత్వే చన్ద్రస్య .. సుఖము కలిగించుటలో చంద్రసమానుడు

వసుధాయా క్షమాగుణైః.. ఓర్పు మొదలైన గుణములలో పృథ్వీ సమానుడు.

బుధ్యాబృహస్పతేత్తుల్యో... బుద్ధిలో దేవగురువు బృహస్పతి సమానుడు.

వీర్యే సాక్షాచ్ఛచీపతే.. పరాక్రమంలో సాక్షాత్తూ దేవేంద్రుడే!

ధర్మజ్ఞః.. ధర్మములెరిగినవాడు

సత్యసన్ధశ్చ..సత్య ప్రతిజ్ఞకలవాడు

శీలవాన్.. శీలవంతుడు

అనసూయకః.. అసూయలేనివాడు

క్షాన్తః.. ఓర్పుకలవాడు

సాన్త్వయితః.. కష్టాలలో ఉన్నవారిని ఓదార్చువాడు

శ్లక్ష్ణః.. మృదుస్వభావి

కృతజ్ఞః.. ఎవరైనా మేలు చేస్తే మరువని వాడు

విజితేన్ద్రియః..ఇంద్రియాలను అదుపులో ఉంచుకొనేవాడు.

..(సశేషం)



కృషి, పట్టుదల, క్రమశిక్షణ..అన్నిటికీ మించి వినయ విధేయతలున్న మంచి వ్యక్తిత్వం..సత్యకుమార్ సొంతం. అవే ఆయనకు తన రాజకీయప్రస్థానంలో ఎనలేని గుర్తింపును తెచ్చాయి. సాధారణ కార్యకర్త స్థాయి నుంచి అసామాన్య నాయకునిగా ఎదిగిన ఆయన జీవితం నేటితరానికి స్ఫూర్తిదాయకం..మార్గదర్శకం. సామాన్య కుటుంబంలో జన్మించినా, విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పుణికిపుచ్చుకుని, అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) నాయకునిగా, ఆ తర్వాత బీజేపీ జాతీయ నాయకునిగా కూడా ఆయన అపార ప్రతిభాపాటవాలతో రాణించారు. విద్యార్థి దశ నుంచే ఏబీవీపీతో బంధం, ఆ తర్వాత బీజేపీతో అనుబంధం కలసి వెరసి ఆయనలోని నాయకత్వ గుణాలకు మెరుగులు దిద్దితే, పూర్వ ఉపరాష్ట్రపతి..భరతమాత ముద్దుబిడ్డ..ముప్పవరపు వెంకయ్యనాయుడుతో పరిచయం, ఆయనతో పాతికేళ్ళ సుదీర్ఘ సాహచర్యం సత్య జీవితాన్ని మలుపుతిప్పాయి. ఆ మహోన్నత నాయకుని మార్గదర్శకంలో సత్య తన జీవితాన్ని తీర్చిదిద్దుకున్నారు. అనేక భాషలను అనర్గళంగా మాట్లాడగలిగే ప్రావీణ్యంతో పాటు, బీజేపీలో పలు కీలక బాధ్యతలను కూడా అత్యంత సమర్ధవంతంగా నెరవేర్చి తన ప్రతిభను నిరూపించుకున్నారు. అంతటి అకుంఠిత కార్యదీక్ష గల సత్యకుమార్‌కు..సాక్షాత్తూ భారత ప్రధాని మోడీ సమక్షంలో, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని మంత్రివర్గంలో స్థానం లభించడం పట్ల పార్టీశ్రేణుల్లోనూ, ప్రజల్లోనూ సర్వత్రా సంతోషం వెల్లువెత్తుతోంది.



## సామాన్యుడే.. అసామాన్యుడయ్యాడు

# కార్యకర్త స్థాయి నుండి.. మంత్రిగా ఎదిగాడు

**'సత్య'**..పూర్తిపేరు సత్యకుమార్‌యాదవ్. ఆయన స్వస్థలం అనంతపురం జిల్లా గాడేకల్లు అనే చిన్న గ్రామం. సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన సత్య, విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల ప్రగతిశీల ఆలోచనా విధానంతో ఎదిగారు. పొద్దుటూరు ప్రభుత్వ మునిసిపల్ స్కూల్, నాగర్‌కర్నూల్ పాఠశాలల్లో ప్రాథమిక విద్య చదువుకుని, బళ్ళారిలో పీయుసి, మదనపల్లిలో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా పూర్తిచేసి, బెంగుళూరులో ఏఎంఐఇ కోర్సు ద్వారా ఇంజనీరింగ్‌లో చేరారు. ఆ రోజుల్లోనే విద్యార్థి రాజకీయాలపై దృష్టి మళ్ళింది. విద్యార్థుల సమస్యల పోరాటానికి ఉద్యమించాడు. ఏబీవీపీతో అనుబంధం పెంచుకుని ఆరోజుల్లోనే ఆయన ఏకగ్రీవంగా కాలేజీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అయినప్పటికీ ఏరోజూ చదువును విడవకుండా, కష్టాలకు వెరవకుండా.. ఉన్నత విద్యలపై ఆయనెంతో ఆసక్తితో చదువుకునేవారు. మధురై కామరాజ్ యూనివర్శిటీ నుండి పొలిటికల్ సైన్సులో మాస్టర్స్ డిగ్రీ సాధించి, చెన్నై ఐటిఎం (ఇన్‌స్టిట్యూట్ ఫర్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్) నుంచి బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిచేశారు.

ఆ తర్వాతకాలంలో బీజేపీతో మంచి అనుబంధం ఏర్పడింది. 1990 నుండి 1993 వరకు బీజేపీ నాయకునిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తూ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లో కూడా గుర్తింపు పొందారు. హిందీ, ఇంగ్లీష్, మరాఠీతో సహా దక్షిణభారతదేశంలో మాట్లాడే అన్ని భాషల్లో సత్యకుమార్‌కు ఉన్న ప్రావీణ్యం ఆయన రాజకీయభవితకు మేలుబాటలు వేసింది.

## వెంకయ్యతో పాతికేళ్ళ అనుబంధం

అప్పట్లో భారతీయ జనతాపార్టీ ప్రధాన కార్యదర్శిగా, కర్నాటక ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ, కర్నాటక–ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఏబీవీపీ నేపథ్యం ఉండి, ఆయా రాష్ట్రాల రాజకీయ వ్యవహారాల్లో తనకు సహాయకారిగా ఉండే వ్యక్తి కోసం అన్వేషిస్తున్న మహానేత ముప్పవరపు వెంకయ్యనాయుడి దృష్టి సత్యకుమార్‌పై పడింది. ఆ సందర్భంగా వెంకయ్యనాయుడుతో ఏర్పడిన పరిచయం సత్యకుమార్‌కు సుమారు పాతిక సంవత్సరాల అనుబంధంగా కొనసాగడం విశేషం. ఆరోజుల్లోనే సత్యకుమార్ జీవితానికో సమున్నత లక్ష్యం ఏర్పడింది. వెంకయ్యనాయుడు రాజకీయ వ్యవహారాలు, పథక రచన, వ్యూహాల రూపకల్పన, వాటి నిర్వహణలో సత్య చేసిన కృషి అమోఘం. ఆ తర్వాత కాలంలో బీజేపీ అగ్ర నాయకుడు లాల్‌కృష్ణ అద్వాణీ నిర్వహించిన రథ యాత్రల్లోనూ ఆయన కీలకపాత్ర పోషించారు. 1998లో పార్లమెంట్ సభ్యునిగా ఉన్న వెంకయ్యనాయుడుకు సత్య ప్రైవేట్ కార్యదర్శిగా సేవలందించడంతో పాటు, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిగా ఉన్నప్పుడు అదనపు ప్రైవేట్ కార్యదర్శిగా, పట్టణాభివృద్ధిశాఖ మంత్రిగా ఉన్నప్పుడు సహాయకారిగా, హోం వ్యవహారాలను చూసే పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మెన్‌గా ఉన్నప్పుడు సీనియర్ ప్రైవేట్ సెక్రటరీగా సత్యకుమార్ తన బాధ్యతలను అద్వితీయంగా నిర్వర్తించారు. అంతేకాదు వెంకయ్యనాయుడు బీజేపీ జాతీయ అధ్యక్షునిగా ఉన్నప్పుడు రాజకీయ వ్యవహారాల్లో ఆయనకు కుడిభుజంగా వ్యవహరించారు. అలా ఏళ్ళతరబడిగా వెంకయ్యనాయుడుతో ఉన్న అనుబంధం, బీజేపీలో అనేకమంది అగ్ర నాయకుల సాహచర్యం ఆయనకు మంచి గుర్తింపునిచ్చింది. అదే ఆయన్ను ప్రజాసేవా రంగంలోకి దింపి, మంత్రి అయ్యే దాకా నడిపించింది.

## బీజేపీ జాతీయ కార్యదర్శిగా

సత్యకుమార్ పార్టీకి అందిస్తున్న విశేషసేవలను గుర్తించిన బీజేపీ అధినాయకత్వం అమిత్‌షా అధ్యక్షత్వంలో 2018లో బీజేపీ జాతీయ కార్యదర్శిగా సత్యకుమార్‌కు బాధ్యతలు అప్పగించింది. అప్పట్లోనే, కేరళ రాష్ట్రంలో బీజేపీ నిర్వహించిన జన్ సురక్ష యాత్ర బృందానికి సమన్వయకర్తగా కూడా సత్యను బీజేపీ అధిష్టానం నియమించింది. 24 రోజులపాటు జరిగిన ఆ యాత్ర పార్టీశ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంపొందించడంలో విజయవంతం కావడంతో సత్య సమర్ధత పార్టీలో మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ తర్వాత కర్నాటక శాసనసభ ఎన్నికల సమయంలో కర్నాటక–ముంబై రీజియన్ పరిధిలో 50 అసెంబ్లీ స్థానాలకు పరిశీలకునిగా సత్యకు పార్టీ బాధ్యతలను అప్పగించింది. అనంతరం, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అధ్యక్షతన పార్టీ తరఫున దేశవ్యాప్తంగా నియమితులైన 12 మంది జాతీయ కార్యదర్శుల్లో దక్షిణ భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక నాయకుడు సత్యకుమార్ కావడం గొప్ప విశేషం.

## గుజరాత్, యూపీ ఎన్నికల్లో కీలక బాధ్యతలు

బీహార్ ఎన్నికల సందర్భంగా ప్రధానమంత్రి బహిరంగ ర్యాలీల నిర్వహణ వ్యవహారాల్లోనూ, పశ్చిమ బెంగాల్, గుజరాత్, కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని జోన్ల పరిశీలన వంటి ముఖ్యమైన బాధ్యతల నిర్వహణలోనూ సత్య తన సమర్ధతను చాటుకున్నారు. అదేవిధంగా ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో కీలక బాధ్యతలు పోషించి సఫలీకృతులయ్యారు. కర్తవ్యదీక్షలో, పార్టీ బాధ్యతల నిర్వహణలో ముందుకు సాగుతున్న సత్యకుమార్, బీజేపీ జాతీయ కార్యదర్శిగా మరోసారి ఎన్నికై తన ప్రతిభను మరోసారి నిరూపించుకున్నారు. బీజేపీ జాతీయ కార్యదర్శిగా ముచ్చటగా మూడుసార్లు ఎన్నికైన ఏకైక కార్యకర్త ఒకే ఒక్క వ్యక్తి.. సత్యకుమార్ మాత్రమే కావడం విశేషం.

## అనేక దేశాల్లో అధికారిక పర్యటనలు

అంతేకాదు, సత్యకుమార్ పలు అంతర్జాతీయ సదస్సుల్లోనూ పాల్గొని భారత్ గౌరవాన్ని ఇనుమడింపజేశారు. యుఎస్ఏ, యుకె, కెనడా, నెదర్లాండ్స్, ఫ్రాన్స్, బెల్జియం, స్పెయిన్, ఇటలీ, చైనా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, సింగపూర్, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, హాంగ్‌కాంగ్, యుఎఇ, మారిషస్, ఇండోనేషియా, మాల్దీవులు తదితర దేశాలకు అధికారిక పర్యటనలు చేశారు.

ప్రస్తుతం పార్టీకి సంబంధించి అండమాన్ – నికోబార్ ద్వీపాల ఇన్‌చార్జిగా, ఉత్తరప్రదేశ్ సహ – ఇన్‌చార్జిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## సీనియర్లున్నా.. సత్యకే మంత్రి పదవి

దాదాపు మూడు దశాబ్దాల నుంచి జాతీయ స్థాయిలో బీజేపీకి సంబంధించి పలు కీలక బాధ్యతలు నిర్వర్తించిన సత్యకుమార్‌కు జాతీయస్థాయి నాయకులతో పరిచయాలు, సత్సంబంధాలు బాగా ఉన్నాయి. అయినప్పటికీ, అత్యంత నిరాడంబరంగా, వినమ్రంగా ఉంటూ పార్టీలో ఎంత ఎదిగినా ఒదిగిపోయి ఉండడం ఆయన సహజ లక్షణం. చిన్నతనం నుంచి కష్టాలను చవిచూసిన వ్యక్తి కనుక, ప్రజల కష్టాల్లోనూ పాలుపంచుకొంటూ వారికి వీలైనంతగా అండగా ఉండడం ఆయన తత్వం. సార్వత్రిక ఎన్నికల్లో రాయలసీమలోని ధర్మవరం శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీచేసి ప్రత్యర్థిపై 3734 ఓట్ల ఆధిక్యతతో ఆయన విజయం సాధించారు. 'సత్య'ం జయేత్! అనిపించారు.

బీజేపీ తరఫున ఎన్నికైన 8 మందిలో మంత్రి పదవికి తొలుత కేంద్ర మాజీమంత్రి సుజనాచౌదరి, రాష్ట్ర మాజీమంత్రి కామినేని శ్రీనివాస్, విష్ణుకుమార్ రాజుల పేర్లు పరిశీలనలోకి వచ్చినా, బీజేపీ అధిష్టానం సత్య వైపే మొగ్గుచూపింది. తొలి గెలుపుతోనే ఆయన్ను మంత్రి పదవి వరించింది. స్వతహాగా సేవాభావం కలిగిన వ్యక్తి కావడం, ప్రజాసేవ చేయాలనే తపన మెండుగా ఉన్న సత్యకుమార్‌కు మంత్రిపదవి లభించడం ఒక్క ధర్మవరం ప్రజలకే కాదు, రాష్ట్రప్రజలందరి అదృష్టమేననాలి. పాతికేళ్ళకుపైగా నెల్లూరుజిల్లాతో అనుబంధం పెనవేసుకున్న "సత్య"కుమార్‌ని మంత్రి పదవి వరించడంతో జిల్లాలో కూడా ఆయన అభిమానులు, మిత్రులు సంబరాలు చేసుకున్నారు. అంతటి ప్రజా సేవాభిలాషి, స్నేహశీలి, సౌమ్యుడు.. సహృదయుడైన సత్యకు తొలిసారిగా మంత్రి పదవి లభించిన సందర్భంగా.. 'లాయర్' అభినందనలు.

# బీజేపీలో బలమైన సైనికుడు.. 'సత్య'


- మెచ్చుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



బీజేపీలో ఎంతోకాలంగా ఓ బలమైన సైనికునిగా విశేషమైన సేవలందిస్తున్న సత్యకుమార్‌కు రాష్ట్ర మంత్రిగా మంచి గుర్తింపు లభించిందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సంతోషం వ్యక్తం చేశారు. ఈనెల 12న మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సత్యకుమార్‌ను, అదేరోజు సాయంత్రం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి సత్యను మెచ్చుకుంటూ మాట్లాడారు. సంఘ్ పరివార్ ద్వారా సత్య పార్టీకి సంబంధించి ఎన్నో కార్యాలను నిర్వర్తించడమే కాక, సమాజాన్ని మేల్కొలిపే అనేక రచనలు చేస్తుండడం అభినందనీయమన్నారు. గత ప్రభుత్వం అవినీతి, అరాచకాలతో ప్రజల్లో కనుమరుగైందని అంటూ, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వంపై ఉందన్నారు. రాష్ట్రంలో కొత్త శకం ఆరంభమైందని, నిజమైన సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తూ పార్టీని బలోపేతం చేసుకోవాలని ఆమె బీజేపీ శ్రేణులకు సూచించారు.

# బీజేపీ సంబరాలు

దేశప్రధానిగా మూడోసారి నరేంద్రమోడీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఈనెల 9న నెల్లూరులోని బీజేపీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. నగరంలోని శివాజీ సెంటర్‌లో మిఠాయిలు పంచారు. మోడీ నాయకత్వంలో దేశం అన్ని విధాలా సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ నాయకుడు పి.సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమలో నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్, నాయకులు నారాయణరెడ్డి, కెవి సుబ్రహ్మణ్యం, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com